

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఉమ్మడి వరంగల్
హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

శుక్రవారం | 10 | అక్టోబర్ | 2025 | పేజీలు : 17


## నగర సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి

### నగర మేయర్ గుండు సుధారాణి

న్యూ డిల్లీ లో ఇక్లి సౌత్ ఏసియా, ఎన్ఐయుఏ సంయుక్త ఆధ్వర్యం లో ఆరైస్ సిటీస్ కార్యక్రమం

నగరం తరపున ప్రాతినిధ్యం వహించిన మేయర్



వరంగల్ టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. దేశ రాజధాని న్యూ డిల్లీ లో ఇక్లి సౌత్ ఏసియా, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ మిగతా 2లో..




# స్థానిక పోరుకు బ్రేక్

లోకల్ బాడీ ఎన్నికలు లిపి వేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ

జిఓ నెంబర్ 9పై స్టే విధించిన హైకోర్టు

నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియ... ఆశావహుల నిరాశ

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 9 , మేజర్ న్యూస్: లోకల్ బాడీ ఎన్నికలు నిలిపిస్తూ వేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల పై స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జివో నంబర్ 9పై హైకోర్టు స్టే విధించింది. జివో నెంబర్ 9 పై హైకోర్టుస్టే విధించడంతో ఆశావహులు తీవ్ర నిరాశ కు గురయ్యాయి. నాలుగు వారాల్లో మిగతా 2లో..

## ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ కృషి చేయాలి

పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పోషకాహారం అందించాలి

నీతి అయోగ్ ప్రభరి అధికారి పొసమి బసు

బుర్రకాయల గూడెం మోడల్ అంగన్వాడి కేంద్రం సందర్శన



5 లో

## ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి పై కేసు నమోదు



2 లో

## రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఆర్టిఐ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించినందుకు జిల్లాకు దక్కిన అవార్డు



8 లో

## మహబూబాబాద్ జిల్లాలో నామినేషన్లు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9,మేజర్ న్యూస్ (సూర్య): మహబూబాబాద్ జిల్లాలో ఎంపీటీసీ జడ్పిటిసి స్థానిక ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మహబూబాబాద్ జడ్పిటిసి స్థానానికి స్వతంత్ర అభ్యర్థి ఎల్దీ మల్లయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీటీసీ స్థానానికి తొర్రూరు – 1, బయ్యారం – 4, నామినేషన్లు దాఖలు చేసి నట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ను ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును కొందరు ఆశ్రయించారు. తాజాగా కోర్టు స్టే ఇచ్చింది.

## ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్

### ఓటమి భయంతోనే బీసీ రిజర్వేషన్ల పేరుతో

### స్థానిక ఎన్నికలను తప్పించుకున్న ప్రభుత్వం

### చట్టబద్ధతలేని జీవోపై ఎన్నికల షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారు

### బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### బిజెపిపై నెపం నెట్టేందుకు కుట్ర

### బిజెపి రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్



పరకాల, అక్టోబర్ 9 మేజర్ న్యూస్, సూర్య,6 గ్యారంటీలు 420 హామీల నిచ్చి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉండడాన్ని గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేం దుకు భయపడుతున్నాడని బిజెపి రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘ నాథ్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒకపక్క ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే యూరియా కొరతతో రైతులను ఇబ్బంది పెట్టిన తీరు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహావేశాలతో ఉండడం, సెప్టెంబర్ 30 లోపు స్థానిక ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఇచ్చిన తీర్పు ప్రకారంగా ఎన్నికలకు పోతే ఎలాగైనా ఓడిపోతామనే భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తూతూ మంత్రంగా మళ్ళీ తీర్పు ఇచ్చిన కోర్టునే ఎన్నికలను ఆపే విధంగా కుట్రలు పన్ని బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఎరగా చూపి స్థానిక ఎన్నికల నుండి తప్పించుకోవడానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి..డ్రామా ఆడి..బీసీలను బలి పశువు చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అమలు చేయాల్సింది కాంగ్రెస్ పార్టీ కానీ చట్టాలకు విరుద్ధంగా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వెళ్లి ఆ నేపాన్ని బిజెపిపై నెట్టేందుకు, బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేషాలన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చట్టబద్ధత లేని జీవో ద్వారా ఎన్నికల షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో వాదించినట్టు గవర్నర్ దగ్గర బీసీ రిజర్వేషన్ల బిల్లు మూడు నెలలు పెండింగ్ లో ఉంటే ఆ బిల్లు పాస్ అయినట్లే అని వాదించారు కదా మరి ఆ బిల్లు ఆధారంగానే షెడ్యూల్ ఇచ్చి ఉంటే బాగుండేదని అన్నారు. ఇక్కడే బీసీ సమాజానికి అర్థమవుతుందని మీ చిత్తశుద్ధి ఏ పాటిదోనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలక్షన్లను నిర్వహించాలా వద్దా బీసీలకు రిజర్వేషన్లను ఇవ్వాలా వద్దా అనే మీ చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీసీ సమాజానికి 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు బిజెపికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అందుకే బిజెపి రాజ్యసభ సభ్యుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య రిజర్వేషన్ కు అనుకూలంగా రాష్ట్ర హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసులో ఇంప్లీడ్ వాదనలు వినిపించారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ రాజకీయ స్వలాభం కోసం బీసీల మనోభావాలతో ఆటలాడుకుంటే సహించబోమని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుంటే బీసీల తిరుగుబాటు తప్పదని మేఘనాథ్ హెచ్చరించారు.

# స్థానిక పోరు కు బ్రేక్

మొదటి పేజీ తరువాయి..
కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పిటిష నర్ల కు రెండు వారాల సమయం ఇచ్చింది. రిజర్వేషన్ల పై తదుపరి విచా రణకు ఆరు వారాలకు వాయిదా వేసింది. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేయడం తో నామినేషన్ల పర్వం మొ దలైంది. రెండు విడతల్లో జెడ్పిటీసీ, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించేం దుకు సన్నాహాలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ఉదయం ప్రారంభం కావడంతో కొందరు ఆశావహులు నామినేషన్ లు కూడా వేశారు. బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టులో మధ్యాహ్నం వాదనలు ప్రారంభమ య్యాయి. ఎవరికి వారే వారి వాదనలు వినిపించారు. రెండు రోజుల పాటు జరిగిన వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం బీసీ రిజర్వేషన్ల జివో 9 పై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియ నిలిచి పోయింది. హైకోర్టు స్టే తో జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలకు బ్రేక్ పడింది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ముఖ్యంగా జెడ్పిటిసి, ఎంపిటిసి స్థానాల నుంచి పోటీ చేయాలని ఆశించిన నాయ కులు, కార్యకర్తలు హైకోర్టు తీర్పుతో డీలా పడిపోయారు. గురువారం ఉదయం మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా నామినే షన్లు దాఖలు చేయడానికి అంతా సిద్ధం కాగా మధ్యాహ్నం వచ్చిన కోర్టు స్టే తో షాక్ కు గురయ్యారు. పల్లె వాతావరణం ఎన్నికల హడావుడి నుండి నిశ్శబ్దంగా మారిపోయింది.

## నగర సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి

మొదటి పేజీ తరువాయి..
(ఎన్ ఐ యు ఏ) సంయుక్త ఆధ్వర్యం లో రెండు రోజుల పాటు (అక్టోబర్ 8,9) ఏర్పాటు చేసిన ఆరైస్ సిటీస్ కార్యక్రమం లో మేయర్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నారు. ఇక్లీ సౌత్ ఏసియా సంస్థ 20 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది డెలిగేట్స్ ఒక ప్లాట్ ఫాం మీదకు తీసుకు వచ్చి ఒకరి విధానాలను మరొకరు పంచుకునేలా ఏర్పాటు చేసినందుకు ఆ సంస్థ కు అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరంగల్ మహా నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ యు జి డి ఏర్పాటుకు ఇప్పటికే రూ 4170 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. వరంగల్ లో విమానాశ్రయం ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు తీసుకొంటున్నారని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసారథ్యంలో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, హూజురాబాద్ వద్ద రూ.150 కోట్ల వ్యయంతో 25 ఎకరాల స్థలంలో 6 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్ ను నెలకొల్పుటకు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నయని అన్నారు. అనేక రకాల క్లైమేట్ చేంజ్ కారకాలను ఛాలెంజ్ గా స్వీకరించి బల్దియా అర్బన్ ఫ్లడింగ్ పైన దృష్టి సారించడం జరిగిందని, వరంగల్ నగరాన్ని విశ్లేషణ చేసి అందుకు తగిన ట్లుగా అడాప్టివ్ మెజర్స్ ను స్ట్రక్చరల్ మెజర్స్, నాన్ స్ట్రక్చరల్ మెజర్స్ గా విభజించడం జరిగిందని తెలిపారు. స్ట్రక్చరల్ మెజర్స్ లో ఇది వరకు డ్రైనేజీ డిజైన్ లు పాత పద్ధతి ప్రకారం చేసే వారమని కానీ వర్షపాతం పెరగడం వల్ల అందుకు అనుగుణంగా డిజైన్లను మార్చడం జరుగుతుందని, నాన్ స్ట్రక్చరల్ మెజర్స్ లో భాగం గా మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్ వారు అందించే డాటాను ఐసిసిసి కు అనుసంధానం చేసి దీని ద్వారా నగర ప్రజలకు ఎప్పటికపుడు అప్రమత్తత ను ప్రకటిస్తున్నామని , స్ట్రాం వాటర్ మేనేజ్మెంట్ కోసం నగరంలోని కొన్ని ప్రాంతాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రకృతి సిద్ధమైన పరిష్కారాలను కూడా అవలంబిస్తున్నామని, ఇందు కోసం వెట్ ల్యాండ్స్ స్పాంజ్ పార్కులు ఎఫారేస్ట్రేషన్ అర్బన్ గ్రీన్ స్పేస్ లేక్ రీస్టోరేషన్ అన్ని నాన్ స్ట్రక్చరల్ మెజర్స్ లో చేర్చడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధిగా మున్సిపల్ బడ్జెట్ నుండి 10 శాతం గ్రీన్ బడ్జెట్ కు కేటాయించాలని ఆదేశించడం మేరకు, దీని పాలసీ తయారుచేసి దానికనుగుణంగా బల్దియాలో మొక్కలు నాటి పచ్చదనం పెంచుతున్నామని తెలిపారు. జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో రినేబుల్ ఎనర్జీ కింద బయోగ్రఫీ ఏర్పాటు చేశామని, నాలుగు లక్షల టన్నుల బయో మైనింగ్ చేయడం జరుగుతుందని, ఎఫ్ ఎస్ టి పి పాలసీ మన రాష్ట్రం లో నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా పీకల్ ఫ్లడ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీని ద్వారా రెవెన్యూ కూడా సేకరిస్తున్నామన్నారు. రెన్యూవల్ ఎనర్జీ కింద సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేస్తున్నాము.ఇక్లి సౌత్ ఏషియా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి అంశాల్లో పూర్తిగా సహకారం అందిస్తున్నారని ఇక్లి వారి సేవలు అనేక ప్రాంతాలకు విస్త రించాయని ఇక్లి వారి సహకారంతో వారిని సంప్రదిస్తూ క్లైమేట్ యాక్షన్ ప్లాన్, బయోడైవర్సిటీ జీరో వేస్ట్ పై ఫ్రేమ్ వర్క్ వంటి అంశాల్లో వారి సహకారాన్ని కోరుతామని తెలిపారు. ఇక్లి, ఎన్ ఐ యు ఏ కలిసి ఆరైస్ కార్యక్రమాన్ని చేపట్టడం అనేది చాలా గొప్ప విషయమని, ఈ కాన్ఫరెన్స్ యొక్క ప్రధాన మైన అవుట్ పుట్ ఢిల్లీ డిక్లరేషన్ అని త్వరలో బ్రెజిల్ దేశం లో జరిగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్-30 లో ఈ అంశాలను ప్రవేశపెట్టి జిడబ్ల్యూ ఎంసీ తరపున నగరంలో అమలు జరుగుతున్న అంశాలను అభిప్రాయాలను అందజేయడం గర్వంగా ఉందని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఐయూఏ డైరెక్టర్ కుండు గిజ్, ఇక్లి డైరెక్టర్ ఏమన్ కుమార్, ఇక్లి సౌత్ ఏషియా హెడ్ , బెంగాల్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ సింగ్, వివిధ దేశాల, నగరాల నుండి సుమారు 200 మంది మేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

## నాగారంలో పోషణ మాసం




పరకాల, అక్టోబర్ 9, మేజర్ న్యూస్, జాతీయ పోషణ మాసం సందర్భంగా ఐసిడిఎస్ పరకాల ప్రాజెక్ట్ నాగారం సెక్టార్ సూపర్ వైజర్ జె. రాణి ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీపురం గ్రామంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 5 ఏళ్ల లోపు చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు ఆర్ బి ఎస్ కె డాక్టర్ రవీందర్ బృందం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పిల్లల్లో పోషణ లోపం వల్ల వచ్చే వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తించారు.

## ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి పై కేసు నమోదు

తరిగొప్పుల అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య : మండలంలోని అక్కరాజు పల్లి లో నమ్మదగిన సమాచారం మేరకు సాకేత్ కమలేష్ వయసు 31 సంవత్సరాలు తన ఇంటి ఆవరణంలో ఒక పెద్ద గంజాయి మొక్క పెంచుతున్నట్లు సమాచారం మేరకు గురువారం రోజున ఎస్ఐ శ్రీదేవి మరియు సిబ్బందితో వెళ్లగా 30 ఇంచుల పొడవైన గంజాయి మొక్క సుమారు దాని బరువు 6.5 కేజీలు ఉంటుందని వారు తెలిపారు పంచుల సమక్షంలో అట్టి గంజాయిని స్వాధీనం చేసుకుని పరారీలో ఉన్న కమలేష్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీదేవి తెలిపారు .

# ఓటు చోరీ పై ఉద్యమిద్దాం

## ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

### 40వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు - మీర్జా అత్తర్

వరంగల్ అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) : ఓటు చోరీపై ఉద్యమించి ప్రజాస్వామాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ 40వ డివిజన్ అధ్యక్షులు మీర్జా అత్తర్ అన్నారు.గురువారం డివిజన్లోని రామస్వామి గుడి ప్రాంగణంలో కొండా దంపతుల ఆదేశానుసారం పీసీసీ పిలుపులో భాగంగా బీజేపీ ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు ఆధ్వర్యంలో ఓట్ల చోరీ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ముఖ్య నాయకులు గడ్డం యుగంధర్ గౌడ్,దాసి రాందేవ్,కోదాటి అనిల్ కుమార్,బత్తిని అఖిల్,దాసరి సుధాకర్,పాల కుమారస్వామి,తెలు సంపత్,మదాసి రజిత, కొండమీది రమేష్ బాబు,వంగరి సురేష్,దయ్యాల వీరేశం,దయ్యాలా కృష్ణ,థౌతం మహేష్, న్యాలపోగుల ప్రశాంత్,నారాయణ గౌడ్, బత్తిని నరేందర్,అవునూరి రాజేష్,డివిజన్ ముఖ్య



నాయకులు కార్యకర్తలు వందల సంఖ్యలో పాల్గొన్నారు.



## పొలాల్లోకి దూసుకుపోయిన కారు

వెంకటాపురం, నూగూరు అక్టోబర్ 9, సూర్య మేజర్ న్యూస్: ములుగుజిల్లా వెంకటాపురం మండలం నూగూరు గ్రామాల మధ్య గురువారం మధ్యాహ్నం ప్రమాదం తృటిలో తప్పింది. వెదుళ్ళ చెరువు సమీపంలో వెళ్తున్న కారు రహదారిపై ఉన్న గోతుల్లో పడటంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకు పోయింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉండగా, అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు సమాచారం అందుకున్న స్థానికులు, జేసీబీ సాయంతో కారును రహదారిపైకి తీసుకురావడం జరిగింది



## కోర్టుకు హాజరుకాని నిందితుడు అరెస్ట్

కేసముద్రం,అక్టోబర్ 9: కేసముద్రం మండలం, కాట్రపల్లి గ్రామానికి చెందిన బానోత్ మంగు అనే నిందితుడు 2013 సంవత్సరమునకు సంబంధించిన కేసు నెంబర్ 17/2013 యు/ఎస్ 354 ఐపీసీ లో 2019 నుండి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న క్రమంలో అతనిపై న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా గురువారం నిందితుడు మంగును అరెస్టు చేసి మహబూబాబాద్ కోర్టు లో హాజరు పరిచి, రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఎం. నరేష్ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దొంతి ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



చెన్నారావుపేట, అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: ఎమ్మెల్యే దొంతి ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.. నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవల మరణించగా మండల కాంగ్రెస్ నాయకులు కాంతమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ జిల్లా కార్యదర్శి మోగిలి వెంకట్ రెడ్డి మాజీ ఎంపిపి కేతిడి వీరా రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్,యువజన కాంగ్రెస్ నాయకులు తప్పేట అఖిల్,బండి దిలీప్, సునీల్ పాల్గొన్నారు..

## ప్రహల్లాద్ సేవలు చిరస్మరణీయం

### మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 9, మేజర్ న్యూస్ (సూర్య): తెలంగాణ మున్సిపల్ సెంట్రల్ పోరం వ్యవస్థాపక అధ్యక్షులు బి. ప్రహ్లాద్ సేవలు చిరస్మరణీయమని, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ అన్నారు. ప్రహల్లాద్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. మహబూబాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో ప్రహల్లాద్ సంతాప సమావేశం నిర్వహించారు. ప్రహల్లాద్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రహల్లాద్ మున్సిపల్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారని, ఈ క్రమంలో మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం అనేక పోరాటం నిర్వహించారన్నారు.ముఖ్యంగా 010 ద్వారా ప్రభుత్వ గ్రాంటు నుండి మున్సిపల్ ఉద్యోగులకు వేతనాల మంజూరులో ఆయన పాత్ర వెలకట్టలేనిది అన్నారు. మున్సిపల్ సెంట్రల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు రమేష్ మహబూబాబాద్ మున్సిపల్ డి.ఇ.,సి. హే. చ్. ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, ఆర్. ఓ.రఘు, లత, రామంచ సుధాకర్, భారత్ రమేష్, చిత్తలూరు వెంకటేశ్వర్లు, కాంపెలి రాజు, విజయ్, ఉపేందర్, లతోపాటు మున్సిపల్ అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొని, ప్రహ్లాద్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## జిల్లాలో పత్తి కొనుగోలుకు కేంద్రాల ఏర్పాటు

హనుమకొండ సూర్య ప్రతినిధి, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ : పత్తి కొను గోలు కేంద్రాల ద్వారా జిల్లాలో పత్తి కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 76463 ఎకరాల విస్తీర్ణంలో పత్తిని రైతులు సాగు చేశారని, సుమారుగా 9,17,556 క్వింటాళ్ల పత్తి రానుందని పేర్కొన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ పంట ఉత్పత్తిని విక్రయించాలంటే తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. పత్తిని విక్రయించేందుకు రైతులు తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు రావాలన్నారు. పత్తిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేటప్పుడు చెత్తా చెదారం లేకుండా నాణ్యమైన పత్తిని తీసుకురావాలన్నారు. నాణ్యమైన పత్తి ఎనిమిది నుండి 12 శాతం లోపు తీసుకొని వచ్చినట్లయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులు పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో



మూడు జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్లు జరుగుతాయన్నారు. పత్తి కొనుగోలు



కేంద్రాల ఏర్పాటు, పారదర్శకంగా పత్తి కొనుగోలు ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు . సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తూనికలు కొలతలు, రవాణా, అగ్నిమాపక, సీసీఐ, ఏఎంసి అధికారులు పాల్గొన్నారు.

# సమర్ధవంతం గా ట్రాన్స్ ఫర్ స్టేషన్ ను నిర్వహించండి

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

### క్షేత్ర స్థాయి లో పోతన ట్రాన్స్ ఫర్ స్టేషన్ పరిశీలన

### నయీం నగర్ ఓల్ మార్కెట్ ప్రాంతం లో

### బయో కంపోస్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి

హనుమకొండ టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: సమర్ధవంతం గా ట్రాన్స్ ఫర్ స్టేషన్ ను నిర్వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధి లోని పోతన ట్రాన్స్ఫర్ స్టేషన్ తో పాటు నయీం నగర్, ఓల్ మార్కెట్ ప్రాంతం సుబేదారి, వాటర్ ట్యాంక్ ,పబ్లిక్ గార్డెన్ ఏనుగుల గడ్డ ప్రాంతం లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్ధవంతం గా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ పోతన నగర్ లో గల ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆపరేషన్, మెయింటె నెన్స్ కు సంబంధించి అన్ని రకాల నిబంధనలు పాటిస్తున్నారా లేదా ఒక స్వచ్ఛ ఆటో చెత్త క్యాంఫాక్టర్ లోకి చేరడానికి ఎంత సమయం తీసుకుంటుం దని సమయాన్ని ఆదా చేయాలని డ్రైవర్లకు సూచించారు . ఏజెన్సీ నిర్వాహ కులు ఇంజనీర్ల ద్వారా అగ్రిమెంట్ లో సూచించిన విధం గా లేబర్ యాక్ట్ ప్రకారం సిబ్బందికి సేఫ్ గాడ్స్ తో పాటు పి పి ఈ కిట్లు ఉండాలని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం లోగా ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని లీచేట్ కోసం డిజైన్ చేసిన ప్రాంతం లోనే వేయాలని పేర్కొన్నారు. లీచేట్ ను శాంప్లింగ్ కు పంపించాలని తెలిపారు. ప్రతి కాంపాక్టర్ రోజు 3 ట్రిప్పులు మొత్తం గా 3 కాంపాక్టర్ లు 9 ట్రిప్పులు వేయాలని, ప్రతి డోర్ నుండి సేకరించిన చెత్త సమయం ప్రకారం గా డంప్ యార్డ్ కు చేరాలని, స్వచ్ఛ ఆటో డ్రైవర్ లు వారి సీరియల్ వచ్చేవరకు





నిలబడి ఉండకుండా కూర్చోవడానికి ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆవరణ లో ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నైట్ వాచ్ మెన్ ను నియమించాలని 3 హుక్ లోడర్ల కు 4 డ్రైవర్ లు అందుబాటు లో ఉండాలని, ట్రాన్స్ఫర్ స్టేషన్ ను శుభ్రంగా నిర్వహించాలని ప్రతి చెత్త తరలింపు వాహనాలు వాటర్ సర్వీసింగ్ చేసే విధంగా ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేసి అట్టి వాటర్ ను డ్రైన్ కు కలిపేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి స్వచ్ఛ ఆటోకు తడి, పొడి కంపార్ట్మెంట్లు వేరుగా ఉండేలా చూడాలని, ప్రజలు తడి పొడి చెత్తను వేరుగా అందించేలా ప్రోత్సహించాలన్నారు. సాయంత్రం మరో దఫా క్షేత్ర స్థాయిలో ట్రాన్స్ ఫర్ స్టేషన్ ను సందర్శించి ఉదయం సూచించిన సూచనలకు అనుగుణంగా శుభ్రంగా ఉందా అని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు ఇదేవిధంగా నిర్వహించాలని సాయంత్రం లోగా ఇలాంటి చెత్త లేకుండా ట్రాన్స్ఫర్ స్టేషన్ పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ట్రాన్స్ఫర్ స్టేషను తెరవాలని అన్నారు. హనుమకొండలోని నయీమ్ నగర్ ప్రాంతంలో ఓల్ వెజిటబుల్ మార్కెట్ యందు బయో కంపోస్ట్ యూనిట్ ను సందర్శించారు. వీధి వ్యాపారులు అట్టి మార్కెట్ ను ఆక్రమించుకున్నారని అప్రాంతాన్ని బయో కంపోస్ట్ ఎరువు తయారు చేయడానికి అనువుగా ఉందని అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఈ ఈ నీ ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఇష్ట రీతిగా పార్కింగ్ చేస్తున్నారని నియంత్రించాలని సిటీ ప్లానర్ ను ఆదేశించారు. హన్మకొండ ఏనుగుల గడ్డ ప్రాంతంలో పర్యటించి పార్కింగ్ చేసి ఉన్న బస్సు యజమానులతో మాట్లాడిన కమిషనర్ ఈ ప్రాంతం వాహనాలు నిలపడానికి కాదని వెంటనే ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని అన్నారు. కార్యక్రమం లో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఎస్ ఈ సత్యనారాయణ, ఏం హెచ్ ఓ డా.రాజేష్ ,ఈ ఈ లు రవికుమార్, మహేందర్ ,మాధవి లత, డి ఈ సారంగం, ఏ ఈ హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అదనంగా మరో ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేయండి

### కలెక్టర్ కు విజ్ఞప్తి చేసిన బుర్రకాయల గూడెం గ్రామస్థులు



గణపురం రూరల్ అక్టోబర్ 09 మేజర్ న్యూస్: మండలంలోని బుర్రకాయల గూడెం ప్రభుత్వ పాఠశాలకు అదనంగా మరో ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు గురువారం కలెక్టర్ రాహుల్ శర్మ కువిజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ స్పందిస్తూ బుర్రకాయలగూడెం పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుడిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్థులు పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థుల సంఖ్య వివరాలు తెలుసుకొని, ప్రస్తుతం 32 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే విద్యార్థుల సంఖ్య తగ్గిందని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో వీధిదీపాలు, పారిశుద్ధ్య పనులు సక్రమంగా లేవని గ్రామస్థులు తెలపగా,చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### పరకాల మండల పరిషత్ అభివృద్ధి

### అధికారి పెద్ది ఆంజనేయులు

పరకాల, అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పరకాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ద ఆంజనేయులు అన్నారు. పరకాల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి యస్ రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా 14 నుండి 17 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలకు మండల స్థాయి కబడ్డీ, ఖో ఖో క్రీడల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ నేటి కాలమాన పరిస్థితులలో విద్యార్థులు చదువుతో పాటు





క్రీడలు ఇతర రంగాలలో కూడా రాణించాలని అన్నారు. రాష్ట్ర ,దేశ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు ఈ సందర్భంగా ఎంపీడీవో పెద్ద ఆంజనేయులు వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు టీ షర్టులు ఉచితంగా ఇస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ పెడరేషన్ పరకాల మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి బి సాంబయ్య, నోడల్ అధికారి నామాని సాంబయ్య, గెజిటెడ్ ప్రదానోపాధ్యాయులు సురేందర్, మదు బాస్కర్ , శ్యాం ,రజిత ,వినయ్ ,సుదీర్, రాజు , శ్రీకాంత్ ,సురేష్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు

# ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ కృషి చేయాలి



**పోషణ లోపంతో బాధపడుతున్న**

**చిన్నారుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**

**వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పోషకాహారం అందించాలి**

**నీతి అయోగ్ ప్రభరి అధికారి పౌసమి బసు**

**బుర్రకాయల గూడెం మోడల్ అంగన్వాడి కేంద్రం సందర్శన**




గణపురం, అక్టోబర్ 09 మేజర్ న్యూస్ సూర్య: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోషణలోపంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నీతి అయోగ్ ప్రభరి అధికారి పౌసమి బసు అన్నారు. గురువారం గణపురం మండలం బుర్రకాయలగూడెం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా చిన్నారులు పూల బొకే అందించి ఆమెకు ఘన స్వాగతం పలికారు. చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, మీ పేరేంటి... నాకోసం ఎదురు చూస్తున్నారా? అంటూ వారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆమె పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం 140 మంది చిన్నారులు పోషణలోపంతో బాధపడుతున్నారని వారికి తగిన వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న బాలామృతం, అలాగే కిశోర బాలికలకు పంపిణీ చేస్తున్న పల్లి, మిల్లెట్ చిక్కీలువివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 8,550 మంది కిశోర బాలికలకు పల్లి, మిల్లెట్ చిక్కీలు అందిస్తున్నామని అధికారుల నుండి సమాచారం అందుకున్న ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ బావుందని సిబ్బందిని అభినందించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పోషణ మాసంలో భాగంగా సీమంతాలు చేసి ఆరోగ్య పరిరక్షణ చర్యలు పాటించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ సుఖ ప్రసవాలతో పాటు ఆరోగ్య వంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని సూచించారు.

**రేగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీల**

ఈ కార్యక్రమానికి ముందు రేగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్ పరిశీలించారు. ఎలాంటి వ్యాధులకు సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశాలకు ఆశా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు విచ్చేసిన ప్రభరి అధికారి పౌసమి బసుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, సిపిఓ బాబురావు, ఉప వైద్యాధికారి డా శ్రీదేవి, డా ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టర్లకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వర్చువల్ సందేశం




**సమాచార హక్కు చట్టంపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్**



గీసుగొండ అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య): సమాచార హక్కు చట్టం- 2005 అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఈ నెల5 నుండి 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా గురువారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతి నుండి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొని సందేశాన్ని వర్చువల్ గా అన్ని జిల్లా కలెక్టర్లలతో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు జిల్లా కలెక్టర్ జి.సంధ్యారాణి,డిఆర్ఓ విజయలక్ష్మి లతో పాటు జిల్లా అధికారులు పాల్గొని వీక్షించారు.ఈ సందర్భంగా ఆర్టిఐ 2005 వారోత్సవాలలో జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ఆర్టిఐ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కోరిన సమాచారాన్ని నిష్పక్షపాతంగా పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కార్యాలయాలలో ఆర్టిఐ సమాచారం అధికారులు పిఎఐ,పిఓ ల పేర్లు వివరాలు టెలిఫోన్ నంబర్ల తో సహా పూర్తి సమాచారం ఉండేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ ఓ విశ్వ ప్రసాద్,జిల్లా అధికారులు ,పి.ఐ.ఓ.లు,ఎ.పి.ఐ.ఓ.లు, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల ప్రక్రియలో పొరపాట్లు లేకుండా చూడాలి

**ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ - డాక్టర్ సత్య శారద**



గీసుగొండ అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య): ఎన్నికల నియమావళి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద అన్నారు. గీసుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో తొలి విడత ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులకు నోటిఫికేషన్ లు జారీ చేసి,నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గీసుగొండ, సంగెం,పర్వతగిరి ,వర్ధన్నపేట ,రాయపర్తి, మండలాల జెడ్పీటీసీ స్థానాలతో పాటు, ఆయా మండలాల పరిధిలోని 64 ఎంపీటీసీ స్థానాలకు మొదటి రోజు నామినేషన్ లు స్వీకరించినట్లు తెలిపారు.కాగ గీసుగొండ మండల కేంద్రం లోని ఎం.పీ.డీ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ,పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మండల అధికారులకు పలు సూచనలు చేశారు.సపోర్టింగ్ స్టాఫ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.నోటీసు బోర్డులపై ప్రదర్శించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేసి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని,నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్.ఓలను ఆదేశించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామినేషన్ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తున్నా మని ఎంపిడిఓ వి.కృష్ణవేణి కలెక్టర్ కు వివరించారు.ఈ కార్యక్రమములో జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి,మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.సురేష్ ఎంపిడిఓ కృష్ణ వేణి, తహసీల్దార్ రియజోద్దీన్ , ఎంపిఓ పాక శ్రీనివాస్ లు, సుపర్ డెంట్ కమలాకర్,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కంపోస్ట్ ఎరువులను బ్రాండ్ ల పేర్ల తో విక్రయాలు జరపాలి

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

### నగరం లోని వివిధప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో సందర్శన

వరంగల్ టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: కంపోస్ట్ ఎరువులను బ్రాండ్ ల పేర్ల తో విక్రయాలు జరపాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు.బుధవారం నగర పరిధి లోని పలివేల్పుల కాకతీయ యూనివర్సిటీ ఫిల్టర్ బెడ్ పోతన రోడ్డు తో పాటు బల్దియా ప్రధాన కార్యాలయంలో గల బయోగ్యాస్ ప్లాంటును క్షేత్రస్థాయిలో సందర్శిం చి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతం గా చేప ట్టుటకు తగు సూచనలు చేశారు. వర్మీ బయో కంపోస్ట్ యూనిట్లు టెండర్లు పూర్తి అయి వర్క్ ఆర్డర్లు ఇవ్వడం జరిగినందున వాటి పనితీరు పరిశీలనకు కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని పలివేల్పుల ప్రాంతంలో పర్యటించి స్థానికం గా వర్మీ బయో కంపోస్ట్ తయారీకి స్థానికుల నుండి వ్యతిరేకత వ్యక్తం కావ డంతో స్థానికులతో మాట్లాడిన కమిషనర్ ఈ ప్రాంతంలో అనుకూలంగా లేకుంటే ప్రత్యామ్నాయంగా డివిజన్ లో వేరే ప్రాంతాన్ని సూచించాలని అన్నారు. పోతన ప్రాంతంలో బయో కంపోస్ట్ సైట్ ను పరిశీలించిన కమిషనర్ సమర్థవంతంగా నిర్వహించుటకు సూచనలు చేశారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో గల బయో మిథనైజేషన్ ప్లాంట్ ను




పరిశీలించి పని విధానాన్ని అడిగి తెలుసుకొని దీనినుండి ఉత్పత్తి అయిన స్లడ్జ్ ను కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి దీనికి ఒక బ్రాండ్ పేరు తో విక్రయించాలని, బల్దియా పరిధిలో తయారు చేసే వర్మీ రీట్రో బయో కంపోస్ట్ ఎరువులు తయారు చేసే క్రమం లో వాటికి ప్రత్యేక బ్రాండ్ పేర్లు నిర్ణయించి విక్రయాలు జరపాలని అలా కానీ పక్షంలో మెప్మా ద్వారా అమ్మకం కౌంటర్ ను ఏర్పాటు చేసి అమ్మకాలు జరపాలని అన్నారు. అన్ని చెత్త వాహనాలు చెత్త ను వేరు చేసి సేకరించాలని వెహికల్ ట్రాకింగ్ చేయడం తో పాటు ప్రత్యేకం గా కమర్షియల్ వేస్ట్ ను సేకరించాలని బల్క్ జనరేట్ చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భం గా కమిషనర్ తెలిపారు కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఈ ఈ మహేందర్, డి ఈ శివానంద్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, ఏ ఈ హరి కుమార్ ,సానిటరీ ఇన్స్పెక్టర్ భాషా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటెలిజెన్స్ ఏడీజీ ని కలిసిన జిల్లా ఎస్పీ



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9,మేజర్ న్యూస్ (సూర్య): తెలంగాణ రాష్ట్ర ఇంటలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్ ను మహబూబాబాద్ జిల్లా సుధీర్ రామ్నాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్, హై కోర్టు తీర్పు,ఎన్నికలు వస్తే నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత చర్యలపై ఇరువురు చర్చించారు. కాగా ఇటీవలే నూతనంగా రాష్ట్ర డీజీపీగా నియామకమైన శివధర్ రెడ్డితో ఎస్పీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9,మేజర్ న్యూస్ (సూర్య):మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో జరిగే అండర్ – 19 జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ కు ఏబీవీ జూనియర్ కాలేజ్ లో సిఈసి మొదటి సంవత్సరం చదువుతున్న వైష్ణవి సెలెక్ట్ అయ్యింది. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు శనివారం నుండి జరగనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ డాక్టర్ చందా విజయ్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ విజేందర్ రెడ్డి, వైష్ణవిని సన్మానించారు. ప్రోత్సాహకంగా వెయ్యి రూపాయలు అందజేశారు. కళాశాల స్టాఫ్ అనిత, సంజీవ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు,శ్రీధర్, శ్రీనివాస్, చండీశ్వర్ ఫిజికల్ డైరెక్టర్ బరుపాటి గోపి విద్యార్థిని అభినందించారు .




## స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే 42 శాతం రిజర్వేషన్లు అంటూ బడుగు బలహీన వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మాయ మాటలు చెప్పి గతంలో బిసిలను మోసం చేసి గద్దెనెక్కింది ఈ కాంగ్రెస్ అన్నారు. ఇప్పుడు కూడా అదే మోసంతో స్థానిక సంస్థ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయి.ఈ నోటిఫికేషన్ వల్ల ఇప్పటికే గ్రామాలలో ఆశావాహులు ఖర్చులపాలయ్యారని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 420 హామీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొట్లాడాలి, అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఢిల్లీ వేదికగా జరగాల్సిన పోరాటాన్ని సీఎం రేవంత్ రెడ్డి గల్లీలో చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని, వారి చేతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వ మోసం

### బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి



ములుగు, సూర్యప్రతినిధి అక్టోబర్ 9 (మేజర్ న్యూస్): బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ పేరిట ప్రజలను మోసం చేస్తూ, కపటప్రేమతో బీసీలను వంచిస్తున్నదని ఆరోపించారు. గురువారం ఆమె ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 42 శాతం రిజర్వేషన్ హామీ అమలులో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఘనంగా హామీ ఇచ్చింది. అయితే ఆ హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైం దని ఆరోపించారు. 50 శాతం పరిమితి అడ్డంకి గురించి ముందే ప్రభుత్వానికి తెలుసని, అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు అసాధ్యమైన వాగ్దానం ఇచ్చిందని ఆరోపించారు. రాజ్యాంగ సవరణ చేయకుండానే, లేదా 9వ షెడ్యూల్లో చేర్చకుండానే కేవలం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రం పై నెపం నెడుతుండడం డ్రామా మాత్రమే అని బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు.

#### రాష్ట్రపతికి బిల్లు పంపడం రాజకీయ నాటకం

బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపడం కేవలం నాటకం అని బీఆర్ఎస్ పార్టీ వ్యాఖ్యానించింది.ఈ బిల్లులు సాంకేతికంగా ఆమోదం పొందవని తెలిసీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆర్డినెన్స్ ఎత్తుగడ అని, చట్టబద్ధత లేని నయవంచన అని దుయ్యబట్టారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయించడం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ ఆర్డినెన్సు కోర్టుల్లో నిలబడవని తెలిసినా, బీసీలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ నాటకం ఆడుతోందని మండిపడ్డారు. బీసీ సంఘాలు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, ఈ ఆర్డినెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. కులగణనపై అపనమ్మకం పారదర్శకత లేకపోవడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన పై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. ఈ సర్వే అసంపూర్తిగా, లోపభూయిష్టంగా ఉందని, ప్రజల ముందు నివేదికను బహిరంగం చేయకపోవడం వల్ల కాంగ్రెస్ నిజమైన ఉద్దేశ్యం సందేహాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ నాటకం, ఓటు బ్యాంకు రాజకీయం కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు, బీసీ సంఘాలు, ప్రతిపక్షాలు ఒకే స్వరంతో వ్యాఖ్యానిస్తున్నాయి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలతో నయవంచన చేస్తోంది. ఓటు బ్యాంకు కోసం మాత్రమే రిజర్వేషన్ హామీ ఇచ్చింది. అమలు చేయడం చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బీసీ లందరు కాంగ్రెస్ కుట్రలను, డ్రామాలను అర్థం చేసుకుని తమ హక్కుల కోసం నిజమైన పోరాటం ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

# షీటీంపై అవగాహన

వెంకటాపురం నూగూరు అక్టోబర్ 9 సూర్య మేజర్ న్యూస్: ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో నీ శివాలయం లో షి టీం ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహనా కలిపించారు ప్రస్తుతం నేరలా బారిన






పడి చాలా మంది నష్ట పోయారని ములుగు జిల్లా ఏస్ పి శబరిష్ ఆదేశాల



మేరకు అవగాహనా కలిపిస్తున్నట్లు తెలపడం జరిగింది విద్యార్థినులు, మహిళల భద్రత కోసమే షీ టీంలను ఏర్పాటు చేశారని, అన్ని కళాశాలలు, విద్యా సంస్థల వద్ద, ప్రధానమైన కూడళ్లలలో షీ టీం నిత్యం ఉంటా యన్నారు. విద్యార్థులను ఎవరైన లైంగిక వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామ న్నారు. లోన్ యాప్ప్, మొబైల్ ఫోన్లలో వచ్చే ఫేక్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండా లని, ఎవరైనా మోసపోతే వెంటనే 1930 గాని 181నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థు లు డ్రగ్స్కు దూరంగా ఉండాలని కోరా రు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ సమూలాల్. కానిస్టేబుల్ బాలకృష్ణ. మేరాజ్. స్వాతి. సాయిబాబా భక్తులుపాల్గొనడం జరిగింది.

# ఇసుక లోడింగ్ కు అక్రమ వసూళ్లు



**ఒక్కో లారీ కి రూ 3 వేల నుండి 4వేలు వసూళ్లు**

**అధికారుల కనుసన్నల్లోనే అక్రమ వసూళ్ల దందా?**

**డ్రైవర్లు నోరు మెదుపుతే లోడింగ్ బంద్**

**మల్లారం క్వారీ నిర్వాహకుల నిర్వాకం**

మల్హర్, అక్టోబర్ 09 మేజర్ న్యూస్ సూర్య : మండలంలోని మల్లారం ఇసుక క్వారీ లో లోడింగ్ పేరిట భారీగా వసూళ్ల దందా జోరుగా సాగుతోంది. క్వారీ నిర్వాహకులు ఒక్కో లారీ కి మూడు నుండి నాలుగు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్లలో అధికారులకు సైతం వాటాలు ముడుతుండడమే అధికా రులు పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలు స్థానికంగా పలువురు వ్యక్తం చేస్తున్నారు. టిజిఎండీసి నిబంధనలకు విరుద్ధంగా దందా సాగుతున్నా అధికారులు మాత్రం మౌన దీక్ష వ్రతంలో ఉన్న చం దంగా వ్యవహరించడం వెనుక వాటాలు ఉన్నాయనే ఆరోపణలకు బలం చేకుర్చుతున్నాయి. ఇసుక అవసరాన్ని బట్టి లారీలు సీరియల్లో లేకున్నా ఒక్కో లారీ వద్ద నుండి రూ 5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు డ్రైవర్లు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సిరీయల్లో లోడింగ్ కోసం క్యూ కట్టిన ఇసుక లారీల డ్రైవర్లు రోజుల తరబడి పస్తులతో పడిగాపులు పడుతున్నారు. ఈ విషయం పై పలువురు సీరియల్లో ఉన్న లారీ డ్రైవర్లు ప్రశ్నిస్తే ఇక లోడింగ్ చేయకుండా రోజుల తరబడి పక్కన పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోడింగ్ పేరుతో అక్రమ వసూళ్ల చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మల్లారం క్వారీ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని లారీ డ్రైవర్లు అధికారులను వేడుకుంటున్నారు. ఇంత అక్రమాలు జరుగుతున్న టిజి ఎండీసి ఉన్నట్లా లేనట్లా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లోడింగ్ పేరిట అక్రమ వసూళ్ల చేస్తున్న క్వారీ నిర్వాహకుల పై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

# విద్యార్థులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**ఎస్ఎఫ్ఐ హనుమకొండ**

**జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్**

**చెవులో పూలు పెట్టుకుని ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన**



పరకాల, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తుందని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్ అన్నారు. గురువారం పరకాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చెవిలో పూలతో నిరసన కార్యక్ర మంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను అన్ని రకాలుగా మోసం చేస్తుందని 8 వేల కోట్ల పైచిలుకు స్కాలర్షిప్ విడుదల చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో మౌళిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి పని చేయాలని పేర్కొన్నారు. లేని యెడల రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం లో అనేక ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, శివ, జశ్వంత్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హైకోర్టు స్టే పై కాంగ్రెస్

# ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలి



తొర్రూర్ అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): రాజకీయ స్వలాభం కోసం బీసీల హక్కులను పణంగా పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ ఆరోపించారు. గురువారం తొర్రూరు లో స్థానిక పార్టీ కార్యాల యంలో ఆయన మాట్లాడుతూబీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ రిజర్వేషన్లపై స్టే విధించడం పట్ల.. కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ తెలిపారు. చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈరోజు ఓబీసీలు ఎదుర్కొంటున్న దురవస్థకు కారణమని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి, న్యాయపరమైన లొసుగులను సరిచేసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్కు పంపినప్పటికీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి ఉన్న మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం గవర్నర్కు పంపిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ గడువు పూర్తికాకముందే ప్రభుత్వం తొందరపడి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టపరమైన లొసుగులను సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూసి, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వర్గాల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని తెలిపారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు 'బిజెపి అడ్డుకుంటోంది' అనే దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చట్టపరమైన అవగాహన లేదా ఆలోచనల స్పష్టత లేదని విమర్శించారు.భారతీయ జనతా పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పూర్తిగా మద్దతు ఇస్తూ దానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి బీసీ రిజర్వేషన్లపై చట్టపరమైన సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లులు తెచ్చి, డిక్లరేషన్లు, ఆర్డినెన్స్ సవరణలు.. ఇలా న్యాయపరంగా చెల్లుబాటు కాని విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేని, చట్టపరంగా తప్పుడు నిర్ణయాలతో బీసీల హక్కులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుందని మండిపడ్డారు. హైకోర్టులో వచ్చిన ఈ ఫలితానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు.బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని బిజెపి డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు.మధ్యప్రదేశ్లో 57 శాతం రిజర్వేషన్ల కోసం బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని, కాబట్టి బిజెపి రిజర్వేషన్లకు మద్దతుగా నిలుస్తోందని వివరించారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కేవలం ఓట్ల కోసం, రాజకీయ స్వలాభం కోసం బీసీలకు అన్యాయం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల, వారి సాధికారత పట్ల నిజమైన చిత్తశుద్ధి లేదని అన్నారు. అసలు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు వేసినవారే కాంగ్రెస్ పార్టీకి చెందినవారని ఆరోపించారు.



## జిల్లాకు చేరుకున్న స్థానిక సంస్థల ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులు



వరంగల్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: స్థానిక ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాకు సాధారణ పరిశీలకులు శృతి ఓఝా ఐఏఎస్, వ్యయ పరిశీలకులు డి శ్రీనివాస్ లు గురువారం వరంగల్ జిల్లాకు చేరుకోగా వారికి స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , అదనపు కలెక్టర్ సంధ్యారాణిలు పుష్ప గుచ్చాలను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది శిక్షణ , ఎస్ ఎస్ టి, చెక్ పోస్టుల ఏర్పాటు, బ్యాలెట్ బాక్స్ లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ నిర్వహణకు తీసుకొంటున్న చర్యలు, శాంతి భద్రతలు, ఎన్నికల వ్యయ , తదితర అంశాలపై వివరించారు. జడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా సూర్యప్రతినిధి, అక్టోబర్ 9, మేజర్ న్యూస్: రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గురువారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అవార్డు అందుకున్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ డిస్ట్రిక్ట్, బెస్ట్ పి ఐ ఓ, బెస్ట్ డిపార్ట్మెంట్ ఇన్ డిస్పోజల్ ఆఫ్ ఆర్టిఐ కేసెస్ మొదలగు ఏడు విభాగాల్లో పురస్కారాలను ప్రధానం చేశారు ఈ క్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అవార్డు ను అందుకున్నారు. ఆర్.టి.ఐ దరఖాస్తు లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండ వ్యవహారిస్తున్నందుకు గానుబెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ గా జనగామ జిల్లా ఎంపిక అయిన సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ అవార్డు ను తీసుకున్నారు. జనగామ జిల్లా కి వివిధ అంశాల్లో అనేక అవార్డు లు వస్తున్నందుకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దిశా నిర్దేశం లో వివిధ శాఖల అధికారులు గా పని చేయడం గర్వం గా ఉందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి కప్పుడు ఆర్ టి ఐ దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలని, పౌరులు అడిగిన సమాచారాన్ని గడువు లోపల ఇస్తున్నారా లేదా అని కలెక్టర్ రివ్యూ చేసేవారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.




# ఏటీసీ కేంద్రాలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ములుగు రోడ్డు లోని ఏటీసీ కేంద్రాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

హనుమకొండ సూర్య ప్రతినిధి, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ : శాస్త్ర సాంకేతిక విద్యను అందించేందుకు ములుగు రోడ్డు లో ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్(ఏటిసి )లలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం ములుగు రోడ్డు లోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో నెలకొల్పిన హనుమకొండ, కాజీపేట, వరంగల్ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇప్పటివరకు పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఏటీసీలలో కోర్సులకు అనుగుణంగా మిషనరీ, టూల్స్ అన్ని అందుబాటులో ఉండాలని అన్నారు. అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు ఆలస్యం చేయకుండా వారం పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఏటిసి విద్యార్థులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా వనరులు



సమకూర్చాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.సీతారాములు, హనుమకొండ ప్రభుత్వ ఐటిఐ, ఏటీసీ ప్రిన్సిపల్ జి.సక్రు, కాజీపేట ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, వరంగల్ ఇన్చార్జి ఓంకార్, టీజీఐఐసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియలో పొరపాట్లు లేకుండా చూడాలి

### ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ - డాక్టర్ సత్య శారద

గీసుగొండ అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య): ఎన్నికల నియమావళి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద అన్నారు.గీసుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో తొలి విడత ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులకు నోటిఫికేషన్ లు జారీ చేసి,నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు.వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గీసుగొండ, సంగెం,పర్వతగిరి, వర్ధన్నపేట ,రాయపర్తి, మండలాల జెడ్పీటీసీ స్థానాలతో పాటు, ఆయా మండలాల పరిధిలోని 64 ఎంపీటీసీ స్థానాలకు మొదటి రోజు నామినేషన్ లు స్వీకరించినట్లు తెలిపారు.కాగ గీసుగొండ మండల కేంద్రం లోని ఎం.పీ.డీ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ,పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మండల అధికారులకు పలు సూచనలు చేశారు.సపోర్టింగ్ స్టాఫ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.నోటీసు బోర్డులపై ప్రదర్శించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేసి పరిశీలించారు.ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని,నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు



బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్.ఓలను ఆదేశించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామినేషన్ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తున్నా మని ఎంపిడిఓ వి.కృష్ణవేణి కలెక్టర్ కు వివరించారు.ఈ కార్యక్రమములో జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి,మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.సురేష్ ఎంపిడిఓ కృష్ణ వేణి, తహసీల్దార్ రియజోద్దీన్ , ఎంపిఓ పాక శ్రీనివాస్ లు, సుపర్ డెంట్ కమలాకర్,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయమూర్తి పై దాడికి యత్నించిన రాకేష్ కిషోర్ దిష్టిబొమ్మ దహనం

### ఉన్మాదిపై దేశద్రోహం కేసు పెట్టాలని న్యాయవాదుల డిమాండ్




వరంగల్ లీగల్ :9 అక్టోబర్: మేజర్ న్యూస్ (సూర్య): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్ దిష్టిబొమ్మను బహుజన న్యాయవాద ఫోరం కన్వీనర్, న్యాయవాది గంధం శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు గేటు ముందు గురు వారం దహనం చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయకర్, న్యాయవాద సంఘం మాజీ అధ్యక్షులు చిల్లా రాజేంద్రప్రసాద్, తీగల జీవన్ గౌడ్, సామాజిక విశ్లేషకులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ లు మాట్లా డారు. దేశ రాజ్యాంగ మూల సిద్ధాంతమైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృ త్వం లను తుంగలో తొక్కడానికి కొంతమంది ఆధిపత్య వాదులు ప్రయత్నం



చేస్తున్నారని, సనాతన ధర్మం పేరుతో ఈ దేశంలో మళ్ళీ మనుధర్మ శాస్త్రాన్ని బలవంతంగా బహుజనులపై రుద్దాలని మతోన్మాద శక్తులు పనిచేస్తున్నాయని, భారత అత్యున్నత ప్రధాన న్యాయమూర్తి పై నే దాడి చేసే పరిస్థితులు తలెత్తుతున్నాయంటే సమాజం సిగ్గుపడాలని, దేశం ఎటు పోతుందోనని ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడి పట్ల ప్రధానమంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షా కనీసం ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు.వెంటనే సదరు ఉన్మాదిని అరెస్టు చేసి దేశద్రోహం కేసు పెట్టాల్సిందిగా న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పరమల్ల కృష్ణ స్వామి, పాము రమేష్, లావుడ్యా సిద్దు నాయక్, రమేష్, దీకొండ ప్రభంజన్, మాడ సృజన్, వరంగల్ జిల్లా న్యాయవాద సంఘం కార్యవర్గ సభ్యులు మహేందర్, నిర్మల, ప్రవీణ,జన్ను పద్మ, కంప వినోద్, పల్లకొండ హరి, కడపాక రాజేందర్,సునీల్ కన్నం, కుమారస్వామి, పాణి, పెండ్యాల అనిల్, మేడ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్.!

### నాలుగు వారాల పాటు విచారణ వాయిదా




వెంకటాపురం నూగూరు అక్టోబర్ 9 సూర్య మేజర్ న్యూస్ : తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు బ్రేక్ పడింది. బీసీ రిజర్వేషన్లపై గురువారం హైకోర్టులో రెండో రోజు వాదనలు కొనసాగాయి. ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం.స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై స్టే విధించింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే ఇచ్చి రేవంత్ సర్కారకు షాక్ ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై విచారణ చేపట్టేందుకు 4 వారాలపాటు దీర్ఘకాలం పాటు వాయిదా వేయడం గమనార్హం. అయితే రెండు వారాల్లోపు అన్ని పార్టీలు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సందిగ్ధత నెలకొంది. ఈ కేసు తదుపరి విచారణలో భాగంగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత దీనిపై హైకోర్టు తుది నిర్ణయం తీసుకోనుంది.



# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది

### బీఆర్ఎస్ ములుగు మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి

ములుగు టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య : బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ములుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ పేరిట ప్రజలను మభ్యపెట్టి, కపటప్రేమతో బీసీలను వంచిస్తోందని ఆయన ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీ అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. 50 శాతం పరిమితి అడ్డంకి గురించి ముందే తెలిసి కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందుంచిన ఈ వాగ్దానం అసాధ్యమని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ చేయకుండానే లేదా 9వ షెడ్యూల్లో చేర్చకుండానే కేవలం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రంపై నెపం వేయడం కేవలం రాజకీయ డ్రామా మాత్రమేనని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపడం నాటకమని, సాంకేతికంగా ఆమోదం పొందవని తెలిసే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని అన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్రెసిడెంట్ చెన్న విజయ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, మండల ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి బాబు, గండి కుమార్, వాంకుడోత్ రాందాస్, గొర్రె రఘుపతి, దూడబోయిన శ్రీనివాస్, కవ్వంపల్లి రాజు, మర్రి అంకుస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏబిఆర్ టీం తరుపున ఎంపీటీసీ స్థానానికి తొలి నామినేషన్ దాఖలు

గీసుగొండ అక్టోబర్ 09 మేజర్ న్యూస్(సూర్య): మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన తుప్పరి వికాస్(ఎస్సీ రిజర్వేషన్)లో ఎంపీటీసీ స్థానానికి తొలి నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా తుప్పరి వికాస్ మాట్లాడుతూ ఏ.బి.ఆర్ అండతో మనుగొండ గ్రామం నుండి ఎంపీటీసీ స్థానానికి తొలి నామినేషన్ వేశానని,అన్ని ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థులు పోటీ చేసి గెలుపొందుతామని, ఎంపీపీ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.అల్లం బాలకిషోర్ రెడ్డి,వీరగోని రాజ్ కుమార్,రడం భరత్ సహకారంతో ముందుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో పేర్ల శ్రవణ్ కుమార్,కుమ్మరి రాజు, గాడుదల బొంద్యాలు,బోయ అశోక్, తుప్పరి ఉదయ్,బోయ అఖిల్, కుమ్మరి ప్రభాకర్ పాల్గొన్నారు.



# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి


### ఉపాధ్యాయులు బోధన ప్రమాణాలు పాటించాలి

### జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్ తేజ

వర్ధన్నపేట అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుజాతైజ సూచించారు. గురువారం వర్ధన్నపేట మండలం లోని ఇల్లంద కేజీబీవీ పాఠశాల, కొత్తపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల లేబర్తి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. కేజీబీవీ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా సృజన్ తేజ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులందరూ త్రిబుల్ ఐటీ లో సీటు వచ్చేలా విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక బద్దలు చదవాలని కోరారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పిల్లల సామర్థ్యాలను పెంపొందించే విధంగా కృషి చేయాలని, ఉన్నత పాఠశాలలో ఐఎఫ్బి ప్యానెల్ ద్వారా ఆన్లైన్ పాఠాలు బోధించాలని, ఖాన్ అకాడమీ ద్వారా ఆన్లైన్ తరగతులు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రతిరోజు మెనూ ప్రకారం పిల్లలకు వడ్డించాలని , ఎఫ్ ఏ 1, ఎఫ్ ఎ 2 మార్కులను త్వరగా ఆన్లైన్లో నమోదు చేయాలని ఎస్ ఎ 1 ఎగ్జామ్స్ కు పిల్లలందరిని సన్నాద్ధం చేయాలని, ఎస్ ఎల్ ఎన్, లిప్ ప్రోగ్రాం ద్వారా తరగతిలో వెనుకబడిన పిల్లలను గుర్తించి తగిన సామర్థ్యాలు పెంచే విధంగా కృషి చేయాలని అన్నారు. వికసిత్ భారత్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే కొత్తపల్లి, ఎంపీపీస్ లేబర్తి పాఠశాలను సందర్శించి విద్యార్థుల యొక్క సామర్థ్యములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పి లు, తదితరుల పాల్గొన్నారు.2







## బస్సు డ్రైవర్ పై ఆకతాయిల దాడి

### ముగ్గురిని అదుపులోకి తీసుకున్న గీసుగొండ పోలీసులు కేసు నమోదు

గీసుగొండ అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య)అర్ధరాత్రి మద్యం మత్తులో ఆకతాయిలు ఆర్టిసి బస్సు డ్రైవర్ పై దాడికి దిగారు. అడ్డుకో బోయిన ప్రయాణికులను సైతం బెదిరించారు. గీసుగొండ పోలీసులకు డయల్ 100 కాల్ వెళ్ళడంతో వెంటనే పోలీసులు స్పందించి ఆకతా యిలను అదుపులోకి తీసుకున్నారు.గీసుకొండ సీఐ డి.విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి ముగ్గురు ఆకతాయిలు మద్యం మత్తులో మోటర్ సైకిల్ అతివేగంగా నడుపుతూ గీసుకొండ మండలం గొర్రెకుంట వద్ద గల మన్నా చర్చి వద్ద రోడ్డుపై ఆర్టీసీ బస్సును అడ్డగించి బస్సు డ్రైవర్ ను,బస్సు నుండి కిందికి లాగి విచక్షణా రహితంగా దాడి చేసి,అడ్డుకోబోయిన ప్రయాణికులను చంపేస్తామని బెదిరించారని,ఆ ముగ్గురు వ్యక్తులు కరీమాబాద్ కి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు.అర్ధరాత్రి డయల్ 100 కాల్ రాగా వెంటనే స్పందించిన గీసుగొండ పోలీసులు అరవింద్,రాజు సంఘటన స్థలానికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న ముగ్గురు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.ఆర్టీసీ బస్సు డ్రైవర్ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుకొండ ఎస్.ఐ అనిల్ కుమార్ ముగ్గురు వ్యక్తులు అజ్మత్,కరిముల్లా,ఉబేద్ ల పై కేసు నమోదు చేసినట్లు గీసుకొండ సీఐ డి.విశ్వేశ్వర్ తెలిపారు.

## పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



### వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు

ములుగు టౌన్, అక్టోబర్9, మేజర్ న్యూస్ సూర్య : పొగాకు వినియోగం మానవాళి ఆరోగ్యానికి హానికరమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు అన్నారు. గురువారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సంరద్భంగా జిల్లా ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్వో మాట్లాడుతూ.. నేషనల్ టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 3.0 లో భాగంగా అక్టోబర్ 9నుంచి 60 రోజుల పాటు గ్రామాల్లో యువత పొగాకు వాడకుండా చైతన్యం కల్పిస్తున్నామన్నారు. పొగాకు వాడకంతో ఊపిరితిత్తులు, గుండె, నోటి క్యాన్సర్, రక్తపోటు వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుందన్నారు. ఆడవారిలో గర్భాశయ క్యాన్సర్, మధుమేహం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పవన్ కుమార్, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రకాంత్, డెమో సంపత్, డీపీఎం సాంబయ్య, హెల్త్ ఆఫీసర్స్ దుర్గారావు, శ్రీనివాస్, వెంకటరెడ్డి, భూపాల్ రెడ్డి, మిడ్ లెవెల్ ప్రొవైడర్స్ దేవమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

# ధర్మారం గ్రామంలో వాడబలిజ సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనం

వాజేడు అక్టోబర్ 9 సూర్య మేజర్ న్యూస్: వాజేడు మండలం ధర్మారం గ్రామంలో వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారంమధ్యాహ్నం రెండు గంటల సమయంలో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది మీటింగ్ కి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం అధ్యక్షులు డర్ర దామోదర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్టు దశాబ్దాల కాలం పాటు వాడ బలిజ కులస్తులకు అన్యాయం జరుగుతూనే ఉంది. కావున వాజేడు మండలంలో బీసీ జనరల్ సీటు జడ్పిటిసి రావడంతో అనేక రాజకీయ పార్టీలు బీసీలను దృష్టిలో పెట్టుకొని వాజేడు మండలంలో అత్యధిక జనాభా కలిగి ఉన్నటువంటి వాడబలిజ కులస్తులకు జడ్పిటిసి టిక్కెట్ ఇచ్చి వాడ బలిజలకు న్యాయం చేయగలరని తెలియజేశారు. గతంలో కూడా 15 సంవత్సరాల క్రితం రెండు పార్టీలు వాడ బలిజల కు టిక్కెట్ ఇస్తే అందులో నుండి ఒక అభ్యర్థి జెడ్పిటిసి అభ్యర్థిగా గెలిపించుకున్న సందర్భాలు చూశారు. అదే కాకుండా ఆ రోజుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జడ్పీ చైర్మన్ పదవి ఇక్కడున్నటువంటి జడ్పిటిసి ఓటు వేస్తే ఎన్నికయే సందర్భంలో కోటి రూపాయల డబ్బులు ఇచ్చి పదవి ఇస్తామన్నా మాట మీద నిలబడ్డ జడ్పిటిసి మా వాడబలిజ కులస్తులే కావడం మాకెంతో గర్వకారణంగా ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల ముందైనా ఎన్నికల తర్వాత అయినా వాడబలిజ కులస్తులు మాట నిలబెట్టుకుంటారు. గనుక అనేక రాజకీయ పార్టీలు, కాంగ్రెస్ పార్టీ కావచ్చు, టిఆర్ఎస్ పార్టీ కావచ్చు, సిపిఎం సిపిఐ పార్టీలు కావచ్చు, బిజెపి పార్టీ కావచ్చు, బహుజన సమాజ్వాది పార్టీ కావచ్చు, ఇలా ఏ పార్టీ అయినా అత్యధిక జనాభా ఉన్న వాడబలిజ కులస్తులకు టిక్కెట్ ఇస్తున్నట్లయితే గెలిపించే బాధ్యత మా వాడ బలిజలదేనని గ లేనియెడల ఏ




పార్టీ ఇవ్వకపోతే ఇండిపెండెంట్ గానైనా వాడ బలిజ సేవా సంఘం తరపున నామినేషన్ వేయడానికైనా వెనకాడబోమని మా అభ్యర్థిని మేము గెలిపించుకుంటామని తెలియజేశారు. జెడ్పిటిసి కాదు ఎంపీటీసీ స్థానాల్లో కూడా బీసీ జనరల్ వచ్చినా సందర్భంగా ఎక్కడెక్కడ అయితే బీసీ అవకాశం వచ్చిందో అక్కడ అక్కడ మా వాడబలిజ సోదరులను నిలబెట్టాలని అన్ని రాజకీయ పార్టీ నాయకులకు అధ్యక్షులకు ఈ వేదిక ద్వారా తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య గారు, మండల అధ్యక్షులు గార నాగార్జున రావు, అధికార ప్రతినిధి బోల్లె ఆదినారాయణ ,ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గార తిరుపతి, మాజీ ఉప సర్పంచ్లు బొల్లె బాబు బోల్లె సూర్యం ,లెనిన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి**

**వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి**

**జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి - ఉంంద్రాతి సుజన్ తేజ**

గీసుగొండ అక్టోబర్ 9 సూర్య మేజర్ న్యూస్: గీసుగొండ(సంగెం) పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉంద్రాతి సుజన్ తేజ అన్నారు.గురువారం సంగెం మండలంలోని లోహిత,గవిచర్ల ఉన్నత,ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి 10వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని,విద్యార్థులందరూ ఐఐఐటి లో సీటు సంపాదించేలా కష్టపడి చదవాలని సూచించారు.పదవ తరగతి





విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పిల్లల సామర్థ్యాలను పెంచేవిధంగా కృషి చేయాలని,ఉన్నత పాఠశాలలో ఐ.ఎఫ్.బి ప్యానెల్ ద్వారా ఆన్లైన్ పాఠాలు,ఖాన్ అకాడమీ ద్వారా ఆన్లైన్ తరగతులు బోధించాలని సూచించారు. ఎఫ్ఏ వన్,ఎఫ్ఏ2 మార్కులను త్వరగా ఆన్లైన్లో నమోదు చేయాలని ఎస్ఏ వన్ ఎగ్జామ్స్ కు పిల్లలందరిని సన్నద్ధం చేయాలని, ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం ద్వారా తరగతిలో వెనుకబడిన పిల్లలను గుర్తించి తగిన సామర్థ్యాలు పెంపొందే విధంగా కృషి చేయాలని,వికసిత్ భారత్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ప్రతిరోజు మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు.



# బుగులోని జాతర లడ్డు, పులిహోర వేలం ఖరారు

**కొబ్బరికాయల వేలం వాయిదా**

**జాతర ఈవో బిల్లా శ్రీనివాస్**

రేగొండ, అక్టోబర్ 09, మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో ప్రతి ఏటా జరిగే శ్రీ బుగులోనీ వెంకటేశ్వర స్వామి వారి జాతర బ్రహ్మోత్సవాల సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. వచ్చే నెల 3 నుండి 10వ తేదీ వరకు జరగనున్న ఏడురోజుల జాతర సందర్భంలో గురువారం వేలంపాటలు ప్రారంభమయ్యాయి. తిరుమలగిరి గ్రామ పంచాయతీ వద్ద దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ కవిత ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారని జాతర ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా లడ్డు, పులిహోర వేలం ఖరారైంది. లడ్డు, పులిహోరలకు కలిపి రూ.20.08 లక్షలు వచ్చినట్లు ఆయన తెలిపారు. గతేడాదికంటే ఈసారి రూ. 5,000 ఎక్కువ పాట నమోదైందని చెప్పారు. అయితే, కొబ్బరికాయల వేలం విషయంలో ఈసారి తక్కువ పాటలు రావడంతో దానిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఈవో శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో జాతర గౌరవ పర్యవేక్షకులు గంగుల రమణారెడ్డి, మాజీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, అర్చకులు కుర్మాచలం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ గంట గోపాల్, నాయకులు కట్ల మధుసూధన్ రెడ్డి, పల్నాటి శ్రీను, ఆకుతోట తిరుపతి, మంతెపురి తిరుపతి, రొంటాల రఘుపతి, అశోక్ పాల్గొన్నారు.

# దుర్గంధంగా దామెర చెరువు మినీ ట్యాంక్ బండ్

**మున్సిపల్ అధికారులు స్పందించాలి**

**బిఆర్ఎస్ యువజన నాయకుడు ఇంగిలి వీరేష్ రావు**



పరకాల, అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: ఆహ్లాదకరంగా ఉండాల్సిన దామెర చెరువు( మినీ ట్యాంక్ బండ్) ప్రాంతం దుర్గంధంతో, చెత్త చెదరంతో కంపు కొడుతూ పరిసర ప్రాంతా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని బిఆర్ఎస్ యువజన నాయకుడు ఇంగిలి వీరేష్ రావు అన్నారు. పరకాల ప్రజలు వాకింగ్ చేయడానికి, మరియు ఆహ్లాదకరంగా పిల్లలతో గడపడానికి గత ప్రభుత్వం సుమారు 4 కోట్ల రూపాయలతో దామెర చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ గా తీర్చిదిద్దిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పాలన పై శ్రద్ధ లేకుండా కేవలం పైసల పైనే శ్రద్ధ వహిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీకి సంబంధించిన ఆటోలే ఇక్కడ చెత్త వేస్తున్నట్టు స్థానికులు వివరించారని, పక్కనే ఉన్న శ్రీనివాసకాలని ప్రజలు ఈ కంపును భరించలేక పోతున్నారని తెలిపారు. ఈ దుర్గంధం వల్ల వారి ఆరోగ్యాలకు నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ లు సమస్యపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు.



# ములుగు జిల్లాలో కోతుల బీభత్సం..!

### ప్రమాదంలో ప్రజల ప్రాణాలు

### నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

### మూడు నెలల్లో 200మందిని కరిచిన కోతులు

ములుగు టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య : ములుగు జిల్లా వ్యాప్తంగా కోతుల బెడద రోజు రోజుకీ విపరీతంగా పెరిగిపోతోంది. పట్టణాలు, గ్రామాల్లోనూ కోతుల దాడుల్లో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా జిల్లా ప్రధాన ఆసుపత్రి పరిసరాలు కోతుల గూడుగా మారిపోయాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు, బంధువులు, వైద్య సిబ్బంది అందరూ కోతుల హింసకు గురవుతున్నారు. ములుగుతోపాటు మల్లంపల్లి, గోవిందరావుపేట, చల్వాయి, జంగాలపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో కోతులు ఇళ్లు పీకి పందిరేస్తున్నాయి. ఇంట్లోకి చొరబడి అందినవన్నీ ఎత్తుకెళ్తున్నాయి. పలువురు కోతుల దాడిలో గాయపడుతున్నారు. విచ్చలడిగా తిరుగుతున్న కోతులను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు.



### 200లకు పైగా ఆస్పత్రిలో కోతుల బాధితుల చికిత్స

ములుగు ఏరియా ఆస్పత్రిలో కోతుల దాడిలో గాయపడి చికిత్స పొందిన వారి సంఖ్య 200లకు పైమాటే. ప్రతీ రోజు ఆరుకు తగ్గకుండా కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. కోతుల దాడిలో గాయపడి వ్యాక్సినేషన్ చేయించుకునే వారు రోజురోజుకి పెరుగుతున్నారు. గురువారం ములుగు మున్సిపాలిటీ పరిధి బండారుపల్లి గ్రామానికి చెందిన చంద్రగిరి సరోజన అనే డెబ్బై ఏళ్ల వృద్ధురాలిపై కోతులు దాడి చేసి తీవ్ర గాయాలు చేశాయి. తొంటి, చేతి భాగాల్లో ఎముకలు విరిగిపోవడంతో ములుగు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం వరంగల్ కు తరలించారు. వృద్ధురాలికి సర్జరీ అవసరమని, పరిస్థితి సీరియస్గా ఉందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





### పట్టించుకోని అధికారులు

ములుగు జిల్లా వ్యాప్తంగా కొతుల బెడద రోజు రోజుకీ పెరుగుతోంది. అడవుల్లో సంచరించాల్సిన కోతులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ములుగు సమీపంలోని గట్టమ్మ, పట్టణ కేంద్రాల సమీపంలో వదిలేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కోతుల నియంత్రణకు కుటుంబ నియంత్రణే మార్గమని పలువురు నిపుణులు భావిస్తున్నా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కోతుల దాడులకు సంబంధించిన ఘటనలు గత కొన్ని నెలలుగా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు మాత్రం పట్టించుకోవడం లేదు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహారం, పండ్లు ఎత్తుకెళ్తున్నాయని, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని, వందల సంఖ్యలో తిరుగు తున్న కోతులను పట్టించి అడవుల్లో వదిలివేయాలని ప్రజలు కోరుతున్నారు.

---

## ఫోక్సో కేసులో నిందితునికి జీవిత ఖైదు...

### బాధితురాలికి 10 లక్షల పరిహారం ఇవ్వాలంటూ కోర్టు తీర్పు

### నిందితులకు శిక్షపడేలా దర్యాప్తు చేసిన

### అధికారులకు ఎస్పీ అభినందనలు



ములుగు, సూర్యప్రతినిధి అక్టోబర్ 9 (మేజర్ న్యూస్) : జిల్లాలో ఫోక్సో కేసులో నిందితునికి జీవిత కాలం శిక్షతో పాటు బాధితురాలికి పది లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలంటూ గురువారం కోర్టు తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే జిల్లాలోని ఏటూరునాగారానికి చెందిన మంతెన రామయ్య అనే నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు అయింది. కేసు పూర్వపరాలను పరిశీలించి గురువారం జీవిత ఖైదు తో పాటు 12 వేల రూపాయల జరిమానాను కోర్టు తీర్పు విలువరించింది. కాగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్సై ఇంద్రయ్య కేసును దర్యాప్తు చేసిన ఐపీఎస్ అధికారి సంకీర్త , ఎటురునాగారం ఎస్పి శివం ఉపాధ్యాయులను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అభినందించారు. నిందితుడికి శిక్షపడేలా సాక్షాలను కోర్టుకు సమర్పించడంలో పోలీస్ అధికారుల పాత్ర అద్వితీయమని కేసును సమర్థవంతంగా నడిపించిన పోలీసు అధికారులను, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ను, కోర్టు కానిస్టేబుల్ ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందనలు తెలిపారు.


---

## సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ కోసం భవనాలను పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య

### సెంటర్ ఏర్పాటుకు సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్తో కలిసి

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) వెల్నెస్ సెంటర్ స్థాపనకు కృషి చేస్తున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గురువారం స్వయంగా క్షేత్రస్థాయిలో భవనాలను పరిశీలించారు. ఇటీవల కలెక్టర్, వరంగల్ మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో పలు భవనాలను పరిశీలించి, ఎంపిక చేసిన భవనాల వివరాలను ఎంపీ డాక్టర్ కావ్య హైదరాబాదులోని సిజిహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణికి తెలియజేస్తూ, సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని సీజీహెచ్ఎస్ డైరెక్టర్కి సూచించారు.ఈ క్రమంలో గురువారం సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణి హనుమకొండ చేరుకుని ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు.



హనుమకొండలోని కాజీపేట డివిజన్ మున్సిపల్ కార్యాలయం, దూరదర్శన్ కార్యాలయంతో పాటు వసతి గృహం, వరంగల్ పాత కలెక్టర్ వసతి గృహం, కుడా కార్యాలయాలను సందర్శించి వాటి స్థితిగతులు, సౌకర్యాలు, విస్తీర్ణం వంటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులు, ఇంజనీర్లతో కలిసి సెంటర్కు అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. భవనం ఎంపిక ప్రక్రియను తక్షణం పూర్తి చేసి సెంటర్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీ డా.కడియం కావ్య సూచించారు. తరువాత హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో పెన్షనర్లు డాక్టర్. కడియం కావ్యను కలిసి సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ మంజూరుకు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే భవనాల పరిశీలనకు సిజిహెచ్ఎస్ డైరెక్టర్ తో ముందడుగు వేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ డా.అప్పయ్య, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించండి



## - సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

పాలకుర్తి అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ స్మారక భవనంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఏదునూరి మదార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా కనకా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పిటిసి ఎంపిటిసి సభ్యులుగా మండలంలోని అన్ని రంగాల కార్మికుల పక్షాన నిరంతరం కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కూలీల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరిస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని వారు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారు సిపిఎం ఆశయాల కోసం పోటీ చేస్తున్నారని మిగతావారు అక్రమ సంపాదన కూడబెట్టుకునేందుకు ముందుకు వస్తున్నారని అలాంటి వారిని తిరస్కరించాలన్నారు. మండలంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎర్రజెండా ఎగరేయడమే లక్ష్యంగా కార్యకర్తలందరూ ముందుండి పని చేయాలన్నారు. దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉంటుందని చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించి లౌకిక ప్రజాతంత్ర శక్తుల గెలుపుకు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, మూస్కు ఇంద్రారెడ్డి, బెల్లి సంపత్, వివిధ గ్రామాల నాయకులు బచ్చు శ్రీలత, ఔడగాని మల్లేష్, కాకర్ల రమేష్, తోట రాజు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత

## - మానవ సేవయే మాధవ సేవా

## - స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి సతీష్




దంతాలపల్లి,అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): దంతాలపల్లి మండలం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ అకాడమీ డైరెక్టర్,డిహబ్ ప్రాజెక్ట్ మేనేజర్ చిర్ర సతీష్ ఆధ్వర్యంలో గురువారం స్ఫూర్తి ఫౌండేషన్ వారి సహకారంతో వరంగల్ సెయింట్ పీటర్స్ కళాశాలకు చెందిన బి ఫార్మసీ 3వ ఏడాది చదువుతున్న నిరుపేద విద్యార్థిని నల్ల శ్రావణికి రు. 40 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. నల్ల శ్రావణి కళాశాల ఫీజు చెల్లించకలేక చాలా ఇబ్బంది పడుతుండడంతో చిర్ర సతీష్ ఈ విషయం తెలుసుకొని స్ఫూర్తి ఫౌండేషన్ వారిని సంప్రదించగా స్ఫూర్తి ఫౌండేషన్ వారు వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా చిర్ర సతీష్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కంటే సహాయం చేసే చేతులే గొప్పవి, మానవ సేవయే మాధవ సేవ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,చిన్నదో పెద్దదో చేతనైనంత సహాయం చేయదానికి అందరూ ముందుకు రావాలని,ప్రతి ఒక్కరూ సమాజ సేవను అలవర్చుకోవాలని ఆయన తెలిపారు. ఆపద కాలంలో స్పందించి నిరుపేద విద్యార్థినికి కళాశాల ఫీజు కోసం ఆర్థిక సహాయం అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు ఓంకార్ ,చిత్తలూరి హుస్సేన్ ,నల్ల పద్మ పాల్గొన్నారు.

# బోడగుట్ట తండాలో పోషణ మాసోత్సవం



కేసముద్రం,అక్టోబర్ 9: అంగన్ వాడీ కల్వల క్లస్టర్ లోని పీక్లా తండ శివారు బోడగుట్ట తండ అంగన్ వాడీ సెంటర్లో గురువారం పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించా రు. ఇందులో పోషకాలను అందించే 20 రకాల పిండి వంటలు, కొత్త రకమైన వంటకాలు, అలంకరణ బాగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అంగన్ వాడీ సూపర్వైజర్ ఎస్.ప్రేమ జ్యోతి మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఎలాంటి జంక్ ఫుడ్ ఇవ్వవద్దని, నూనె పదార్థాలు,చక్కెర, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉంచాలన్నారు. గర్భిణీ స్త్రీలు ప్రతినెల పరీక్ష చేయించుకుని తగిన పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంత మైన బేబీ జన్మిస్తుందని చెప్పారు. పిల్లల పెరుగుదల విషయంలో ఎప్పటికప్పుడు పోషకాహారం అందిస్తూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆహార పదార్థాలను చిరుధాన్యాలతో తయారుచేసి పిల్లలకు అందించారు. హాజరైన వారందరితో పోషకాహారం పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గనె యాదగిరి, కార్యదర్శి ఇ.నివాస్ రెడ్డి, టీచర్ గనె పావన, క్లస్టర్ లోని అంగన్ వాడీ టీచర్లు జీ.నీల, టి.వాణి, ఈ. జ్యోతి, బి.సునీత, బి. స్వప్న, జి.పద్మ, ఆశా వర్కర్లు ఎం.నాగ లక్ష్మి, ఎస్.ఉపేంద్ర, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు.

# గవాయి పై దాడి గర్హనీయం




కేసముద్రం,అక్టోబర్ 9: భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి గవాయిపై దాడి చేయడం గర్హనీ యం అని ఎమ్మార్పీఎస్ మండల అధ్య క్షులు కొమ్ము నాగరాజు అన్నారు. గురువారం నాగరాజు మాట్లాడుతూ ప్రధాన న్యాయ మూర్తి పై జరిగిన దాడి భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం,దేశ దళిత బహుజనలపై దాడి జరిగినట్లేనని అన్నారు. ఈ సంఘటనను దళిత, గిరిజన,మేధావులు, ప్రజలు వ్యతిరేకించాలని ఆయన కోరారు.

# మండల స్థాయి పాఠశాల క్రీడోత్సవాలు

## – ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్ రెడ్డి



దంతాలపల్లి,అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): దంతాలపల్లి మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు అండర్ 14, అండర్ 17 విభాగాలలో కబడ్డీ,ఖో- ఖో, వాలీబాల్ క్రీడోత్సవాల నిర్వహణ కోసం వివిధ పాఠశాల నుండి వచ్చిన విద్యార్థులకు ఎంపిక ఉంటుందని ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండలం లోని వివిధ గురుకులాల పాఠశాలల ప్రిన్సిపాల్ లు, వ్యాయామ ఉపాధ్యాయుని,ఉ ఉపాధ్యయులు క్రీడోత్సవాలకు పాఠశాలలోని ప్రతిభ గల క్రీడాకారులు (విద్యార్థిని, విద్యార్థులను )తీసుకుని రావాలని సూచించారు.

# ఉపాధ్యాయ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక



డోర్నకల్ అక్టోబర్09: మేజర్ న్యూస్ (సూర్య): డోర్నకల్ మండలంలోని హున్యతండాలో పనిచేస్తూ సెప్టెంబర్ 30న అకస్మికంగా మరణించిన రమేష్ కుటుంబానికి గురువారం వారి స్వగ్రామమైన బత్తినివారిపల్లెలో డోర్నకల్ మండలంలో ఉపాధ్యాయుల వద్ద సేకరించిన 60,000(అరువది వేలు )విరాళాలను గురువారం దశదిన కర్మలను సందర్భంగా వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సంతాపకార్యక్రమంలో పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్ టీఎస్ యుటిఎఫ్ జిల్లాకార్యదర్శి వివేక్ మాట్లాడుతూ రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారికి ప్రభుత్వపరంగా రావాల్సిన బెనిఫిట్స్ అన్ని సకాలంలో వచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు రమేష్ లాంటి ఒకమంచిఉపాధ్యాయుని కోల్పోవడం విచారకరమని వారులేని లోటును భర్తీ చేయలేమన్నారు వారి కుటుంబానికి ఉపాధ్యాయ ఐక్యవేదిక తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ సభ్యులు సీతరాములు ఎస్సీ,ఎస్టీ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్,టీఎస్ యుటిఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ అజీజ్,శివ ప్రసాద్ పిఆర్టియు అధ్యక్షులు ప్రభుదాస్,చిలుకోడు కాంప్లెక్స్ సహాయకార్యదర్శి రాములు సీనియర్ నాయకులు బుచ్చయ్య యువనాయకులు రాజశేఖర్,సతీష్ తదితరులు పాల్గొన్నారు

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వ మోసం

## అనుకున్నదొక్కటి అయ్యింది ఒక్కటి బోల్తా కొట్టింది ప్రభుత్వం

## దేశగాని సతీష్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్

కొడకండ్ల,అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య) : బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం "బీసీ డిక్లరేషన్" పేరిట ప్రజలను మోసం చేస్తూ, కపటప్రేమతో బీసీలను వంచిస్తున్నదని ఆరోపించారు.42 శాతం రిజర్వేషన్ హామీ అమలులో మోస స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఘనంగా హామీ ఇచ్చింది.అయితే ఆ హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. 50శాతం పరిమితి అడ్డంకి గురించి ముందే తెలుసు, అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు అసాధ్యమైన వాగ్దానం ఇచ్చిందని ఆరోపించారు.రాజ్యాంగ సవరణ చేయకుండానే, లేదా 9వ షెడ్యూల్‌లో చేర్చకుండానే కేవలం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రంపై నెపం నెడుతుండడం డ్రామా మాత్రమే అని బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. రాష్ట్రపతికి బిల్లు పంపడం రాజకీయ నాటకం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపడం కేవలం నాటకం అని బీఆర్ఎస్ పార్టీ వ్యాఖ్యానించింది. ఈ బిల్లులు సాంకేతికంగా ఆమోదం పొందవని తెలిసీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తాయి.ఆర్డినెన్స్ ఎత్తుగడ చట్టబద్ధత లేని నయవంచన బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినెట్‌లో నిర్ణయించడం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ ఆర్డినెన్స్‌లు కోర్టుల్లో నిలబడవని తెలిసినా, బీసీలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ నాటకం ఆడుతోందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.బీసీ సంఘాలు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, ఈ ఆర్డినెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. అ కులగణనపై అపనమ్మకం పారదర్శకత లేకపోవడం... కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన పై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి.ఈ సర్వే అసంపూర్తిగా, లోపభూయిష్టంగా ఉందని, ప్రజల ముందు నివేదికను బహిరంగం చేయకపోవడం వల్ల కాంగ్రెస్ నిజమైన ఉద్దేశ్యం సందేహాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ నాటకం – ఓటు బ్యాంకు రాజకీయం బీఆర్ఎస్ నేతలు, బీసీ సంఘాలు మరియు ప్రతిపక్షాలు ఒకే స్వరంతో వ్యాఖ్యానిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలతో నయవంచన చేస్తోంది.ఓటు బ్యాంకు కోసం మాత్రమే రిజర్వేషన్ హామీ ఇచ్చింది.అమలు చేయడం చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇది. "ఇప్పటికైనా బీసీ లందరు కాంగ్రెస్ కుట్రలను, డ్రామాలను అర్థం చేసుకుని తమ హక్కుల కోసం నిజమైన పోరాటం ప్రారంభించాలి" అని పిలుపునిచ్చారు.



# అంగన్వాడి విద్యార్థులకు పోషణ ఎంతో ముఖ్యం

## - లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు మల్లికార్జున చారి





పెద్దవంగర, అక్టోబర్ 9, (సూర్య న్యూస్) అంగన్వాడి విద్యార్థులకు పోషణ ఎంతో ముఖ్యమని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు తంగళ్ళపల్లి మల్లికార్జున చారి అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్వాడి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమంతో పాటు పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున చారి సరస్వతీదేవి పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయంలో పూజలు చేసి తీసుకువచ్చిన పలకలను అంగన్వాడీ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జడ్జి చిదిరాల నవీన్ ఆర్పి దామెర సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పూజారి సమక్షంలో నిర్వహించినందున విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పెద్దవంగర ప్రతినిధులు ఎడవల్లి మధుసూదన్ రెడ్డి, ముత్తినేని శ్రీను, కేశబోయిన సుభాష్, జలగం సతీష్, అంగన్వాడి ఏ సి డిపిఓ విజయలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్ శోభ, శ్రీదేవి సునీత అంగన్వాడి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత వాగ్దానాలు చేసిన ప్రభుత్వాన్ని ఎండగట్టాలి

## మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

## ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

నెల్లికుదురు అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలోచేసిన హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై పోరాడాలని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని మాజీశాసనసభ్యులుబానోత్ శంకర్ నాయక్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోమాజీ శాసనసభ్యులు బానోతు శంకర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డ్ పంపిణీ చేశారు.అనంతరంవారు మాట్లాడుతూస్థానిక ఎన్నికల బరిలోపోరాడడానికి గ్రామ గ్రామానఒకరిని మించి ఒకరుపోటాపోటీగా ఉరకలు వేస్తున్నారని,ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత మొదలైందని అన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన6గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసారు.100రోజుల్లో ఏకకాలంలో ప్రతిరైతు కి 2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి 41 వేల కోట్లలో కేవలం 13 వేల రుణమాఫీ మాత్రమే చేసారని, రైతు బంధు క్రింద ఎకరాకి 15 వేలు ఇస్తామని గడిచిన 22 నెలల్లో ఒకసారి రైతు భరోసానిధులుఎగ్గొట్టి అరకొరగా వేయడంజరిగిందనిఅన్నారు.అంతేకాక కల్యాణలక్ష్మి క్రిందలక్షతోపాటుతులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిందని,మహిళలకు 2500 ఆదపిల్లల కు స్కూటిఇస్తామని మోసం చేశారని విమర్శించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులుపరిపాటి వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీమాధవి,మాజీ ఎంపీటీసీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు బత్తిని అనిల్,భీముడు,మండల యూత్ అధ్యక్షులు హెచ్ అశ్విన్,పట్టణ అధ్యక్షులు గొట్టుముక్కల ఆది రెడ్డి,పిఎసిఎస్ వైస్ చైర్మన్ బొజ్జ్య నాయక్,బిక్కు నాయక్,బొల్లు మురళి,పాశం రమేష్, పులి రామచంద్రు,ఎండి రెహమాన్, కారం ప్రశాంత్,మధుకర్,అచ్చు నాయక్, బోల్లపల్లి శ్రీను,భూక్య శ్రీను,మస్కపురి రమేష్,ఎడ్ల మహేష్, మంగీలాల్, యశోద భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రపంచ దృష్టి దినోత్సవ శిబిరం ఏర్పాటు



బచ్చన్నపేట అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): 26వ ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు స్థానిక గవర్నమెంట్ కమ్యూనిటీ హాస్పిటల్లో చికిత్స శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం ర్యాలీని నిర్వహించారు ఈ సమావేశంలో హాస్పిటల్స్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ సర్వేంద్రియం నయనం ప్రధానం అన్నారు అన్ని ఆర్గాన్స్ చెంచ్ ఆర్గాన్ లో కెల్లా నేత్రమనాది ప్రధానమైనదని అర్థం అందుకే కంటి చూపును ఐదు కాలాలపాటు జాగ్రత్తగా చూసుకోవాలని ముఖ్యంగా ఆకుకూరలు కూరగాయలు క్యారెట్ తీసుకోవాలని పాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి,డాక్టర్ రాములు,డాక్టర్ సిద్ది,నర్సింగ్ సిబ్బంది పారామెడికల్ సిబ్బంది ఫార్మసిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

- జిల్లా జడ్జి విక్రమ్
- బాల్యవివాహాలు చేస్తే చర్యలు తప్పవు
- పోక్సో చట్టంపై అవగాహన

తరిగొప్పుల అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య : బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనగామ జిల్లా జడ్జ్ విక్రమ్ అన్నారు తరిగొప్పుల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం రోజున పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీలకు ఫోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరిస్తూ లైంగిక వేధింపులకు గురైనప్పుడు నిర్భయంగా సమాచారాన్ని తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు పోలీస్ వారి టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారాన్ని అందించాలని తెలిపారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపైన చర్యలు తీసుకోవడం తో పాటు బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వీటిని నిర్మూలనకై ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 1098 ఫోన్ చేసి సమాచారాన్ని తెలపాలని చిన్న వయసులో వివాహం చేసుకోవడం వల్ల అమ్మాయిలు అబ్బాయిల జీవితాలు నాశనం అవుతాయని చిన్నపిల్లలను వివాహం చేసుకొని వారితో సంసారం చేసిన భర్తకు ఫోక్సు చట్టం కింద పది సంవత్సరాలు జైలు శిక్ష కూడా ఉంటుందని వారు తెలిపారు బాల్య వివాహం చేసుకున్న లేదా ప్రోత్సహించిన అట్టివారికి జైలు శిక్షలతో పాటు జరిమానా ఉంటుందని వారు చట్టాల పైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐ అబ్బయ్య ఎస్ఐ శ్రీదేవి ఎంఈఓ జానకి భవిత సెంటర్ అడ్వకేట్ దయామని సుధారాణి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.







## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం



నడికుడ అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య : నడికూడ మండలంలోని నర్సక్క పల్లె గ్రామములోని అంగన్వాడి కేంద్రాలు అంగన్వాడి సెంటర్లలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సూపర్వైజర్ హేమలత నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. పోషణమాసం ప్రతిజ్ఞ చేశారు చిన్నారులకోసం ప్రభుత్వం ఇచ్చిన అంగన్వాడీ టీచర్స్ తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ని ప్రదరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ సంత, సుప్రియ , రజినికుమారి, లక్ష్మి, ఆయాలు: రాధ, వనజ, ముత్యాలు రమ, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు హజరై పోషణమాస అవగాహన సదస్సును విజయవంతం చేసారు.

## ఫలపుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరైన జంగా రాఘవరెడ్డి



కాజీపేట అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) జనగామ జిల్లా తరిగొప్పుల మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి సోదరీమణి పొన్నాల రాధిక-రవీందర్ రెడ్డి కుమార్తె నూతన ఫల- పుష్పలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి. వీరితోపాటు మాజీ మార్కెట్ చైర్మన్ సుధాకర్ ఎర్రమళ్ళ, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వేమల్ల రాజమౌళి, చింతకింది మల్లేశం, జనగామ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ అషు తదితరులు పాల్గొన్నారు.

## ఏ.డి.ఆర్.ఎం (ఓ) ఏ సంజీవ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రైల్వే జేఏసీ



కాజీపేట అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) : తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ కు నూతనంగా విచ్చేసిన ఏ.డి.ఆర్.ఎమ్ (ఓ) ఏ. సంజీవరావు ని మర్యాదపూర్వకంగా కలిసి వారికి డ్రై ఫ్రూట్, బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి సికింద్రాబాద్ డివిజన్ కు వారి ద్వారా మెరుగైన సేవలు అందించాలని కాజీపేట రైల్వే జంక్షన్ కు అన్ని విధాల సహకరించాలని కోరడం జరిగింది, దానికి వారు ప్రతిస్పందిస్తూ వారి పరిధిలో ఉన్న అభివృద్ధి పనులకోసం తప్పకుండా సహకరిస్తానని వారు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘువేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కో కన్వీనర్ పి. రమేష్, కె. సాయిరాజ్, వైస్ చైర్మన్లు పి శ్రీనివాస్, ఎమ్ మహేష్, కాజీపేట సంఘ్ సేవకులు నల్లెల సోమేశ్వర్ రావు పాల్గొన్నారు.

# సీజేఐ పై దాడి అమానుషం

## - తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం

కాజీపేట అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని కాజీపేట రైల్వే జంక్షన్ చౌరస్తా లో తేజోమాయి మాల కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మర్యాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మాల కుల సంక్షేమ సంఘం నాయకులు సభ్యులకు కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమం ఇటివల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై దాడి అమానుషమని దీనిపై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్యక్షులు మర్యాల కృష్ణ పాల్గొని మాట్లడుతు దేశ సర్వోన్నత న్యాయసనం చీఫ్ జస్టిస్ బీల్ గవాయ్ పై దాడి చేయడం రాజ్యాంగ విరుద్ధమని పాఅమనిల్ అమణుశమని, న్యాయవాది రాకేష్ కిశోరను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి కేంద్ర ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు, ఇంకా ఇలాంటి ఘటనలు మునుముందు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, జస్టీస్ గవయ్ పై దాడిని యవత్ భారత ప్రజలందురు ఖండించాలని యస్సి, యస్టి, బిసి, మైనార్జీలము ఐక్యంగా ఉండి రాజ్యంగాన్ని కాపాడు కుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి పప్పులు కావర్ధన్, నాయకులు కోమ్మాలు, తండమల్ల వేణు, సిరీల్ లారెన్స్, మైలారం శంకర్, బండి రాంచందర్, పడిదల శేఖర్ (బాచి), పోతుల సాంబయ్య, మద్దెల కార్తిక్, బండారి నర్సింగరావు, దార సురేందర్, బరాబరి శ్రీకాంత్, బరబర ఉప్పల్ రావు, బండారి నర్సింగరావు, గడ్డబాబు, గోర్రె ఈశ్వర్, కె.వి రావు, పోతరాజు రాజేశ్వరరావు, జ్యోతిబాన్ కెశవులు, కాలమాల మహేందర్, అండమల్ల రా ఉమ్ముల మహందర్, రాజ్ కుమార్, తాండమల్ల రాజేందర్, రాజు బొబ్బలి రాజేందర్ పాల్గొన్నారు.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

# అడ్డుకుంటున్న బిజెపి,బిఆర్ఎస్

## రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం
## హైకోర్టు తీర్పుతో నిరాశ చెందాం
## బీసీలకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం
## జంగిటివిద్యనాథ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

బచ్చన్నపేట అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య) : బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా మా సీఎం ఒంటరి పోరాటం చేశారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాం. కులగణన చేయడంతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చాం,బీసీ నోటికాడి బువ్వ అందకుండా పోయింది. అయినా మేం నిరాశ చెందం పోరాటం కొనసాగుతుంది.మా ప్రభుత్వం న్యాయపోరాటాన్ని కొనసా గిస్తుంది.తప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి పెడతాం.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఇప్పటికైనా బీసీల ఆవేదనను అర్థం చేసుకోవాలి అని అన్నారు. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తప్పని సరిగా రిజర్వేషన్లు సాధించుకుందాం అని అన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ లో చేరిన "సేను రాజేష్ "



దంతాలపల్లి,అక్టోబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన సామాజిక విద్యావేత్త సేను రాజేష్ మండల నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి వర్యులు డిఎస్ రెడ్యా నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు,అనంతరం రెడ్యా నాయక్ గారు మాట్లాడుతూ సేన్ రాజేష్ పార్టీలోకి రావడం పార్టీకి మరింత బలం చేకూరింది అని అన్నారు. ముఖ్యంగా రాజేష్ పేద ప్రజలకు అందుబాటులో ఉంటు వారు చేస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు, రాజేష్ తో పాటు వివిధ పార్టీల నుండి 100 మంది కార్యకర్తలు బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. సేను రాజేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నా వంతు క్రుషి తప్పకుండా ఉంటుంది అని తెలిపారు.పార్టీ జాయినింగ్ కి సహకరించిన దంతాలపల్లి మాజీ సర్పంచ్ నాయిని శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ కిషోర్,నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.





# ఈ దీపావళి పండుగ కైనా వెలిగించరా?

## ఆత్మకూరు జాతీయ రహదారి పైన ఉన్నటువంటి సెంటర్ లైటింగ్ నిర్వహణ నందు లోపించిన సమయపాలన
## చీకటిలో అసాంఘిక కార్య క్రమాలకు అడ్డాగా మారుతున్నాయి
## ఈ పండుగ కైనా వెలిగించాలని అధికారులను నిలదీస్తున్న గ్రామ ప్రజలు

ఆత్మకూరు అక్టోబర్ 09, మేజర్ న్యూస్ (సూర్య): గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారి పైన ఉన్నటువంటి సెంటర్ లైటింగ్ సిస్టం గత కొంతకాలంగా వెలగడం లేదని గ్రామస్తులు అంటున్నారు. అవి షోకేజీ బొమ్మల వల్లే నిలబెట్టారని చెప్పుకుంటున్నారు . ఈ దీపావళి పండుగ కైనా సమయానికి వెలిగించరా అని వాహనదారులు అంటున్నారు. ఇకనైనా ప్రత్యేక అధికారి శ్రద్ధ వహించి ఆత్మకూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారి పైన ఉన్నటువంటి సెంట్రల్ లైటింగ్ లోని వెలుగని లైట్ల ను సరిచేసి సరైన సమయపాలనతో వెలిగించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.



# పరిపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగమణి
- ఘనంగా పోషణ మాస వేడుకలు



నెల్లికుదురు అక్టోబర్ 9 మేజర్ న్యూస్(సూర్య) పరిపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికరమైన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలనిఐసిడిఎస్ సూపర్వైజర్ నాగమణి అన్నారు.గురువారం మండలంలోని మునగలవీడు సెక్టార్లోపోషణ మాసం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పాల్గొని మాట్లాడుతూబాలింతలు గర్భిణీలు చిన్నారులు ఆరోగ్యంగా ఉండడానికిపౌష్టికరమైన ఆహారం తీసుకోవాలని అన్నారు.తప్పనిసరిగా పాలు పండ్లు గుడ్లు ఆకుకూరలు పప్పు దినుసులుఆహారంలో భాగంగా చేసుకుని తప్పనిసరిగాతీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలోడాక్టర్ రమ్య,ఏఎన్ఎం రేణుక,అంగన్వాడి టీచర్లు వీరలక్ష్మి, వెంకటమ్మ, జమాలిబీ,మహతి,ఆశ వర్కర్లు,గర్భిణీలు బాలింతలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పునరావృతం కావాలి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ



పాలకుర్తి అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య):స్థానిక సంస్థల ఎన్నికల్లో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రుణావుత్తం అయ్యేందుకు కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కార్యకర్తలకు సూచించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డిల ఆదేశాలు మేరకు గురువారం మండలంలోని పెద్దతండా (బి)ఎంపీటీసీ క్లస్టర్ పెద్ద తండా, రాఘవాపురం గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల అధిక మెజార్టీని సాధించేందుకు కార్యకర్తలు అందరూ సైనికుల పని చేయాలని సూచించారు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దతండా(బి), రాఘపురం గ్రామల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లాకావత్ రవి,ముస్కు శ్రీను,తిగారం తాజా మాజీ సర్పంచ్ పోగు శ్రీను,పెద్దతండ(బి)గ్రామ ఇంచార్జ్ భూక్యా మల్లేష్, మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిమ్ ట్రైనర్‌కీ సన్మానం



లింగాలఘనపూర్ అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య : జనగామ జిల్లాలో గత 8 సంవత్సరాలుగా స్వామి ఫిట్నెస్ జిమ్ సెంటర్ పేరుతో లాభాపేక్ష లేకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని సంకల్పంతో జిమ్ సెంటర్ నడుపుతున్న గాడిపెల్లి స్వామి కి ఇటీవల గోల్డ్ జిమ్ ఫిట్నెస్ ఇన్స్టిట్యూట్ ముంబయి లో కోచ్ గా ట్రైనింగ్ పూర్తి చేసుకొని సర్టి ఫికెట్స్‌తో వచ్చిన సందర్భంగా లింగాల ఘనపూర్ మాజీ ఎంపీపీ రాజు ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఐలయ్య, పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేసిన ఎర్రబెల్లి

పాలకుర్తి అక్టోబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) : పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మోసపూరిత బాకీ కార్డుల పంపిణీ ఈ కార్డులను మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ నాయకులు ఇంటి ఇంటికి తిరిగి ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీ అసత్యప్రచారాలతో అధికారం లోకి వచ్చి 22 నెలలు అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవటంతో నేడు ప్రజలకి కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేసి రానున్న ఎలక్షన్లో ఓటు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఈ కార్డు చూపించి ఈ హామీలు ఏమయ్యాయి అని నిలదీయాల్సిందిగా ప్రజలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, పలు గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సీనియర్, నాయకులు, కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గోన్నారు.

# జస్టిస్ గవాయిపై దాడి చేసిన లాయర్ పై చర్యలు తీసుకోవాలి



చిట్యాల, అక్టోబర్ 9 మేజర్ న్యూస్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై దాడి చేసిన లాయర్ పై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బి. ఆర్ గవాయి పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పుల్ల మల్లయ్య మాట్లాడుతూ సుప్రీం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయి ఉండడం ఇష్టం లేక ధాడి చేశాడని తెలిపారు. బి ఆర్ గవాయ్ కుటుంబము బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు ఆశయాలు అర్థం చేసుకుని నడుస్తూ ఆయన తీర్పులు ఆలోచించి ఇస్తున క్రమంలో ఆయన పై కావాలని దాడి చేయడమంటే పార్లమెంటుపై దాడి చేసినదిగా భావిస్తున్నామన్నారు. లాయరు రాకేష్ కిషోర్ సీనియర్ కౌన్సిలర్ అయి ఉండి జడ్జి పై చెప్పు విసరడం సిగ్గు చేటు అన్నారు. లాయర్ రాకేష్ కిషోర్ ను కోర్టు నుండి శాశ్వతంగా బహిష్కరించాలని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాసారపు నరేష్, గడ్డం సదానందం, బంజర్ల రవీందర్, నేరెళ్ల రమేష్, నేరెళ్ల చేరాలు, గిన్నారపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మూడు రవి





నల్లబెల్లి, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: నల్లబెల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మూడు రవి, ప్రధాన కార్యదర్శిగా కంకటి రమేష్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికై య్యారు. సంఘం ఉపాధ్యక్షులుగా అవునూరి కిషోర్, గౌరవ అధ్యక్షులుగా సామల సునీల్, అనుమల నితీష్, కార్యవర్గ సభ్యులుగా ఉడుత రాజు, వాంకుడోత్ రాజేష్, రాజు, సురేష్ లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు మూడు రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల మిద మా గళం వినిపిస్తామని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## గ్రూప్ 2 ర్యాంకర్ కు సత్కారం



భీమదేవరపల్లి, అక్టోబర్ 09(మేజర్ న్యూస్ సూర్య): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రంజిత్ గ్రూప్ 2 పరీక్షలో రాష్ట్రస్థాయిలో 196 వ ర్యాంక్ సాధించి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ యువజన నాయకుడు బొల్లంపల్లి రాజు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం రంజిత్ ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రంజిత్ ప్రస్తుతం మెడికల్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

## ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన మహిళలు



తరిగొప్పుల అక్టోబర్ 9 మేజర్ న్యూస్ సూర్య : తరిగొప్పుల మండల కేంద్రంలోని 13వ కాలనీలో మంచినీరు రాకపోవడంతో మంచినీటి బోరు వద్ద గురువారం రోజున మహిళలు నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత రెండు నెలలుగా గ్రామపంచాయతీ బోరు పాడవడంతో మరమ్మతులు చేయించి తిరిగి అమర్చిన కూడా రెండు మూడు రోజులు మాత్రమే మంచినీరు అందాయని తిరిగి వెంటనే పాడైపోవడంతో ఇట్టి సమాచారాన్ని అధికారులకు అందించినా కూడా వారు ఏమాత్రం స్పందించడం లేదంటూ కాలనీవాసులు వాపోయారు మిషన్ భగీరథ నీరు కొద్దిసేపు మాత్రమే వస్తుందని అది కూడా ఇంటి అవసరాలకు సరిపోవడం లేదు దీనికి తోడు మిషన్ భగీరథ నీరు అన్ని ఇండ్లకు సరిపడా మీరు రావడం లేదంటూ మహిళలు వాపోయారు ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త మోటర్ ను అమర్చి మంచినీటి సమస్యను శాశ్వతంగా తీర్చాలని కాలనీవాసులు కోరారు ఈ కార్యక్రమంలో నరసమ్మ సిద్ధమ్మ లచ్చవ్వ కనకవ్వ సంధ్య నీలమ్మ సమ్మవ పరమవ్వ కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు దేహదారుడ్యాన్ని పెంపొందిస్తాయి

**– జిల్లా అధ్యక్షులుసతీష్ గౌడ్**

**– ఘనంగా ఎస్‌జిఎఫ్ 69వ జోనల్ స్థాయి గేమ్స్**



నెల్లికుదురు అక్టోబర్ 9 మేజర్‌న్యూస్ (సూర్య): క్రీడలుదేహ దారుడ్యాన్ని పెంచుతాయని ఎస్ జి ఏ జిల్లా అధ్యక్షులు సతీష్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహబూబాబాద్ జిల్లాఎస్ జిఎఫ్ అధ్యక్షులు సతీష్ గౌడ్, సెక్రటరీ ఎండి. ఇమామి ఆద్వర్యంలో జోనల్ స్థాయి క్రీడలు, స్థానిక మండల విద్యాదికారి ఆంగోతురాందాస్ కేసముద్రం ఎంఈఓ కాలేరు యాదగిరి, ఇనుగుర్తి ఎంఈఓ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కబడ్డీ17 వయస్సులో హెచ్ ఓ-కే హెచ్ ఓ జోనల్ 14,బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేయడం జరిగిందని అన్నారు. బహుమతుల దాతగా కంపాటి బిక్షపతి నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు, కేసముద్రం, ఇనుగూర్తి మండలాల పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీవో 9 పై హైకోర్టు స్టే ఇవ్వడం బీసీలకు తీరని అన్యాయం

**– బీసీ రిజర్వేషన్ అమలు కోసం ఇక ఉద్యతంగా పోరాటాలు**

**– బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రాములు**



హనుమకొండ టౌన్, అక్టోబర్ 9, మేజర్ న్యూస్ సూర్య : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 9 పై రెండవ రోజు హైకోర్టులో వాడిగా వేడిగా వాదోపవాదాలు జరిగిన తర్వాత హైకోర్టు స్టే ఇవ్వడం అత్యంత బాధాకరమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ రాములు అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారం భమైన తర్వాత హైకోర్టు స్టే ఇవ్వడం, ఆరు వారాలపాటు కౌంటర్ల దాఖలుకు గడువు ఇవ్వడం కాలయాపనచేయడం ఎందుకని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ బడుగు బలహీన వర్గాలకు న్యాయం కల్పించడంలో విఫల మైందన్నారు. బీసీలకు తరతరాలుగా అన్యాయం జరుగుతూనే ఉన్నదని సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కోసం జనాభాలో మేమెంతో మాకంతా నినాదంతో ఉద్యమాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తూ శాసనసభలో బిల్లులు ఆమోదించి గవర్నర్‌కు పంపించి ఆరు మాసాలు దాటిన స్పందించ కపోవడం బీజేపీనే కారణ మన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీ బిల్లు ఆమోదించి రాజ్యాంగం లోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చకపోవడం బీసీల ఎడల వారికున్న చిత్తశుద్ధి ఏమిటో నిరూపితమైందన్నారు. రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు సమై క్యంగా రిజర్వేషన్లు సాధించేదాకా బీసీలకు బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేదాకా పోరాటాలను ఉద్యతంగా నిర్వహించాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.